మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## సమస్యలను మంత్రికి విన్నవించిన కౌన్సిలర్


సమస్యలను మంత్రికి వివరిస్తున్న కౌన్సిలర్

**సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్ 17, ప్రభాతవార్తన:** ప్రజాపాలన దినోత్సవ కార్యక్రమంలో పాల్గొనడానికి విచ్చేసిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను జిల్లా కలెక్టరేట్‌లో కలిసి మంగళవారం వార్డులో నెలకొన్న సమస్యలను వార్డు కౌన్సిలర్ సాకి బాల్ లక్ష్మీఅనంద్ వివరించారు. ఈ సందర్భంగా మంత్రి వెంటనే స్పందిస్తూ వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ అశ్రిత్ కుమార్‌ను ఆదేశించినట్లు తెలిపారు. అలాగే మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను వివరించగా మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నిజాం ప్రభుత్వాన్ని కూల్చిన ఘనత కమ్యూనిస్టులదే

### సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్

**సిద్దిపేట రూరల్, సెప్టెంబర్ 17, ప్రభాతవార్త :** నిజాం ప్రభుత్వాన్ని కూల్చిన ఘనత కమ్యూనిస్టులదేనని సీపీఐ జిల్లాకార్యదర్శి మంద పవన్ అన్నారు. సిద్దిపేటలోని ఎడ్ల గురువారెడ్డి భవన్‌లో సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం తెలంగాణ విలీన దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో భారత కమ్యూనిస్టు పార్టీ పాత్ర ఎంతో ఉంద న్నారు. భూమి, భుక్తి, అణగారిన వర్గాల కోసం రైతుల సమస్యలపై రజాకారుల రాజకీయ పాలనను అంతమొందించడంలో సీపీఐ కీలక పాత్ర పోషించిందన్నారు. సాయుధ పోరాటంలో ఇసుక రేణువంత పాత్ర కూడా బిజిపికి లేదన్నారు. పది లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిందిం కమ్యూనిస్టులేనని తెలిపారు. పాలక వర్గాలు ప్రజలను విస్మరిస్తే నాటి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కిష్టపురం లక్ష్మణ్, బన్సీలాల్, పిట్ల మల్లేశం, కర్ణాల చంద్రం, మిట్టపల్లి సుధాకర్, వేల్పుల ప్రసన్నకుమార్, బిక్షపతి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.


జడ్పీ కార్యాలయంలో జండానుఆవిష్కరిస్తున్న కలెక్టర్ క్రాంతి వల్లూరు

## సంగారెడ్డిలో ఘనంగా ప్రజా పాలన దినోత్సవం

### -జండాను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

**సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని సంగారెడ్డిలో జిల్లా పరిషత్ కార్యాలయంలో మంగళవారం జాతీయ పతాకాన్ని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు ఆవిష్కరించారు. అంతకుముందు జడ్పీహాల్ ప్రాంగణంలోని మహాత్మాగాంధీ, బిఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ జానికిరామ్, ఆర్‌డిఓ రాజు, పంచాయితీరాజ్ ఈఈ జగదీష్, అధికారులు పాల్గొన్నారు.

## 'ప్రధాన మంత్రి ఆవాస్ యోజన అర్బన్ 2.0'ను ప్రారంభించిన ప్రధాని మోడీ

### వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్, అధికారులు


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త:** ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 2.0 కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఒడిషా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో మధ్యాహ్నం 12 గంటలకు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన అర్బన్ 2.0 కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా లాంఛనంగా ప్రారంభించారు. మంగళవారం జిల్లాలోని సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని వీడియో సమావేశ మందిరం నుంచి అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, పంచాయితీ రాజ్ ఈఈ నరసింహులు, మెప్మా పీడీ ఇందిరా, మెదక్ మున్సిపల్ కమీషనర్ జానకిరామ్ సాగర్, సంబంధిత లబ్దిదారులు ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి మాట్లాడుతూ 5 సంవత్సరాల్లో 10 లక్షల కోట్లతో కోటి పట్టణ గృహాలను నిర్మించేందుకు ప్రణాళిక రూపకల్పన చేసినట్లు పేర్కొన్నారు. సంక్షేమ కార్యక్రమాల అమలులో భారతదేశం ముందంజలో ఉందని, పట్టణంలో నివసించే పేదలకు, మధ్య తరగతి ప్రజలకు బాసటగా నిలిచేందుకు ఈ పథకం ప్రవేశపెట్టడం జరిగిందని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నర్సాపూర్, తూప్రాన్ మున్సిపల్ కమీషనర్లు, సంబంధిత లబ్దిదారులు పాల్గొన్నారు.

## రైతులకు పారదర్శక సేవలు అందించాలి : డిసివో


ములుగు పిఏసిఎస్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న డిసిఓ నాగేశ్వరరావు

**ములుగు, సెప్టెంబర్ 17 (ప్రభాతవార్త):** సహకార సంఘాలలో రైతులకు పారదర్శకంగాసేవలందించాలని జిల్లా సహకార అధికారి నాగేశ్వర రావు అన్నారు. మంగళవారం ములుగు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాన్ని సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్టర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి అకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఏసిఎస్ ఆధ్వర్యంలో కామన్ సర్వీస్ సెంటర్స్‌ను ఏర్పాటుచేసి రైతులకు ఈ గవర్నర్ సేవలందించాలని సూచించారు. రైతులకు స్వల్ప వ్యవధిలో రుణాలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట సీనియర్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, పిఏసిఎస్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి రమేష్‌బాబు, సిబ్బంది స్వరూప, అశోక్ ఉన్నారు.

## తెలంగాణ విమోచన దినోత్సవంపై కాంగ్రెస్ ద్వంద్వ నీతి : ఎంపి రఘునందన్‌రావు

**సిద్దిపేట రూరల్, సెప్టెంబర్ 17, ప్రభాతవార్త :** తెలంగాణ విమోచన దినోత్సవంపై కాంగ్రెస్ ద్వంధ నీతి ప్రదర్శిస్తుందని మెదక్ ఎంపి రఘునందన్‌రావు విమర్శించారు. ప్రదాన నరేంద్రమోడీ జన్మదినంన సందర్భంగా మంగళవారం సిద్దిపేటలో బీజేవైఎం జిల్లా అధ్యక్షులు నీలం దినేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విమోచన దినోత్సవాన్ని కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుంటే తెలంగాణలో ఎందుకు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. మహారాష్ట్ర ప్రభుత్వం జాతీయ జెండా ఎగురవేసి విమోచన దినోత్సవం జరిపిందన్నారు. కాంగ్రెస్ పార్టీకి విమోచన దినోత్సవంపై ఒకే స్టాండ్ ఉంటే రెండు రాష్ట్రాలలో అలా ఎందుకు జరుపుతుందని నిలదీశారు. తెలంగాణలో బిజెపి అధికారంలోకి రాగానే విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహస్తామన్నారు. కెసిఆర్ అధికారంలో ఉన్నంత కాలం తెలంగాణ తల్లి విగ్రహం ఎందుకు పెట్టలేదన్నారు. ప్రధాన మోడీ జన్మదినం సందర్భంగా వారం రోజుల పాటు సేవ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గంగాడి మోహన్‌రెడ్డి, సొప్పదండి విద్యాసాగర్, విభీషణ్‌రెడ్డి, బాలేష్‌గౌడ్, ఉపేందర్‌రావు, సురేష్‌గౌడ్, శ్రీనివాస్, కొత్తపల్లి వేణుగోపాల్, బాసంగారి వెంకటి, గోనె మార్కండేయులు, తొడుపునూరి వెంకటేశం, సంతోష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపి రఘునందన్‌రావు

# త్యాగాల ఫలితమే తెలంగాణ

### మంత్రి దామోదర్ రాజనర్సింహా

**సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని కలెక్టర్ కార్యాలయంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి దామోదర్ రాజనర్సింహా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమానికి మంత్రి దామోదర్ రాజనర్సింహాతో పాటు జిఐఐసీ చైర్మన్ తూర్పు నిర్మల జయప్రకాశ్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్‌లు చంద్రేశేఖర్, మాధురి, జిల్లా ఎస్‌పి రూపేష్ చెన్నూరిలు ముఖ్య అతిథులుగా హాజరై కలెక్టరేట్‌లోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి అంజని ఘటించి, అమరవీరుల స్థూపం వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహా పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహా మాట్లాడుతూ జిల్లాలో కొనసాగుతున్న ప్రగతిని, సెప్టెంబరు 17 ప్రాముఖ్యతను వివరించారు. తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా రాచరిక వ్యవస్థ నుంచి ప్రజాపాలన ఆవిర్భావానికి నాంది పలికిన అమరులైన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులు, స్వతంత్ర సమరయోధులకు జోహార్లు అర్పించారు. తెలంగాణ ప్రజల అభివృద్ధినే కాంక్షిస్తూ సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ఆరు గ్యారంటీల పథకాలు ప్రజలకు చేరువ చేస్తున్నామన్నారు. రైతుల రుణమాఫీ చేపట్టి వారికి భరోసా కల్పించామన్నారు. సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి దామోదర్ రాజనర్సింహా

# విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదు

### నిర్లక్ష్యం చేసిన సిబ్బందిని సస్పెండ్ చేస్తూ ఆదేశాలు.. ఆకస్మిక తనిఖీలో మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**కౌడిపల్లి, సెప్టెంబర్ 17, ప్రభాతవార్త:** విధుల పట్ల బాధ్యత రహిత్యంగా వ్యవహరిస్తూ, నిర్లక్ష్యం చేసే సిబ్బందిపై శాఖ పరమైన చర్యలతో పాటు వేటు తప్పదని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ హెచ్చరించారు. మంగళవారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ కౌడిపల్లిలోగల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పిహెచ్‌సిలో సంబంధిత అధికారులు, సిబ్బంది హాజర్ పట్టికను పరిశీలించగా విధులకు హాజరుకాకున్నా పట్టికలో సంతకం చేసిన సిబ్బందిపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మందులు నిల్వ ఉంచే గదిని, పరిసరాలను పరిశీలించారు. అనంతరం రోగులతో ఆరోగ్య కేంద్రంలో వైద్యులు చేసే సేవల పట్ల ఆరా తీసి అసంతృప్తిని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతు కౌడిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్య సదుపాయాలపై పలు ఫిర్యాదులు వచ్చాయనారు. అందుకోసమే క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా తనిఖీచేయడానికి విచ్చేసినట్లు ఆయన తెలిపారు.


కౌడిపల్లి పిహెచ్‌సిని తనిఖీ చేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మెరుగైన వైద్య సేవలు ప్రజలకు అందించాలని ఆయన అన్నారు. వారం రోజుల్లో కౌడిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న సమస్యలను గర్తించి, పరిష్కరిస్తామని ఆయన హామి ఇచ్చారు. జిల్లా సమర్ధవంతమైన పాలన లక్ష్యంగా ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయడానికి క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలని, ఆకస్మికంగా పర్యటనలు చేయడం నిరంతరాయంగా జరుగుతాయని ఆయన తెలిపారు. తనిఖీలో విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన ఏంతటి వారినైనా ఉపేక్షించేది లేదని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. విధుల పట్ల బాధ్యత రహిత్యంగా వ్యవహరించిన రమేష్, రాధాకృష్ణ, మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్స్ అబ్దుల్ షకీల్ (ఎంపిహెచ్ఇఒ) ముగ్గురిని సస్పెండ్ చేయాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీరామ్‌కు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశాలు జారీ చేయగా , స్పందించిన జిల్లా వైద్యాధికారి వెంటనే ముగ్గురిని సిబ్బంది సస్పెండ్ చేస్తూ, పిహెచ్‌సి కౌడిపల్లికి మెయిల్ ద్వారా ఉత్తర్వులు జారీ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. అలాగే కౌడిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రవీన్ కుమార్‌కు మోమో జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తోపాటు కౌడిపల్లి పిహెచ్‌సి వైద్యాధికారిని, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వినాయకుల నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ వల్లూరి క్రాంతి

**సంగారెడ్డి మున్సిపాలటి సెప్టెంబరు 17,ప్రభాతవార్త:** సంగారెడ్డి పట్టణంలోని వినాయకుల నిమజ్జనం మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. పట్టణ సమీపంలోని మహబూబ్‌సాగర్ చెరువులో నిమజ్జనం చేయడానికి వివిద వార్డులలో ఏర్పాటు చేసిన గణనాయకులను తరలించారు. నిమజ్జనం చేయడానికి ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, అధికారులు క్రేన్‌లను, విధ్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. నిమజ్జనం ఏర్పాట్లను మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి, ఆదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌లతో కలిసి పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు భారీ ఏర్పాట్లు చేశారు.


వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరి క్రాంతి

## వాయిస్ ఆఫ్ ముస్లిం యూత్ హజ్ కి అవాజ్

### -మిలాద్ మెగా రక్తదాన శిబిరం

**గుమ్మడిదల, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త:** మహమ్మద్ ప్రవక్త పుట్టిన రోజు పురస్కరించుకొని మిలాద్ ఉన్ నవీ పండుగ సందర్భంగా గుమ్మడిదల మండలంలోని జీఎస్ఎన్ గార్డెన్‌లో వాయిస్ ఆఫ్ ముస్లిం యూత్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ హైదరాబాద్‌లోని తలసేమియా వ్యాధికి సంబంధించిన హాస్పిటల్‌లో చిన్న పిల్లల కోసం రక్తదాన శిబిరం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆయా ప్రాంతాలకు చెందిన ముస్లిం సోదరులు, మత పెద్దలు ఉమ్మడి మండల ముస్లిం సోదరులు పాల్గొని విజయవంతంగా నిర్వహించారు. ముఖ్యంగా తలసేమియా వ్యాధి సోకిన చిన్న పిల్లలకు ప్రతి నెలకు ఒక్కసారి రక్తాన్ని ఎక్కించాలి. అందుకు ప్రతి సంవత్సరం మహమ్మద్ ప్రవక్త పుట్టిన రోజు పురస్కరించుకొని ఈ మెగా రక్తదాన శిబిరం జిన్నారం, గుమ్మడిదల మండలం ఉమ్మడిగా నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి గుమ్మడిదల ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పుట్ట నర్సింగరావు, స్థానిక తాజా మాజీ జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, జిల్లా నాయకులు మూడు చింతల నరేందర్‌రెడ్డి, తాజా మాజీ సర్పంచి నరసింహారెడ్డి, నాయకులు మహమ్మద్ హుస్సేన్ పాల్గొని రక్తదానం చేసిన దాతలకు షీల్డ్ మెమొంటోలు వారి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వాయిస్ ఆఫ్ ముస్లిం యూత్ అధ్యక్షులు ఫయాజుద్దీన్, ఉపాధ్యక్షులు మహమ్మద్ ఖలీల్, మహమ్మద్ జుబేర్ ఖాన్, మైనార్టీ అధ్యక్షులు మహమ్మద్ అజార్, సభ్యులు మహమ్మద్ ఇసాక్, షేక్ ఇమ్రాన్, షేక్ మొయిజ్, షేక్ అజీమ్, సల్మాన్ ఖాన్, అన్సార్, ఫైజల్, మజేర్, యువకులు, ముస్లిం మత పెద్దలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య స్ఫూర్తితో ప్రజా పాలన

### మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** గొప్ప చారిత్రాత్మక వారసత్వం.. మహోన్నత పాలన విధానాలకు కొలువైన తెలంగాణ 1948 సెప్టెంబర్ 17న సువిశాల భారతదేశంలో అంతర్భాగంగా మారి రాచరిక పరిపాలన నుంచి ప్రజలచే పాలించబడే ప్రజాస్వామ్యంలోకి పరివర్తన చెందిందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. తెలంగాణ ప్రజా పాలన దినోత్సవంలో భాగంగా సిద్దిపేట జిల్లాకేంద్రంలోని డిగ్రీ కళాశాల మైదానంలో మంగళవారం ఏర్పాటు చేసిన వేడుకల్లో ఆయన పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవవందనం చేశారు. అనంతరం పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమైక్య రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతం అన్ని రంగాల్లో వివక్షతకు గురవడంతో తెలంగాణ ప్రజల్లో స్వరాష్ట్ర అకాంక్ష పెరుగుతూ వచ్చిందన్నారు. 1971 తర్వాత తెలంగాణ ప్రాంతంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగంలో అనేక మార్పులు వచ్చాయన్నారు. దీంతో తెలంగాణ ప్రజల్లో చైతన్యం పెరిగి హక్కుల సాధన కోసం అన్ని వర్గాల ప్రజలు ఉద్యమ బాట పట్టారని తెలిపారు. మలిదశ తెలంగాణ ఉద్యమం కొత్త పుంతలను తొక్కిందన్నారు. ప్రజల ఆకాంక్షను గమనించిన సోనియాగాంధీ సారథ్యంలో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయడానికి నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ప్రజాస్వామ్య స్ఫూర్తితో ప్రజా పాలనను కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందన్నారు. ప్రజా, పారదర్శక పాలన సమాజంలోని అన్ని వర్గాలకు స్వేచ్ఛ, సామాజిక న్యాయం సమాన అవకాశాలు దక్కాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. దేశానికి ప్రతి రూపం తెలంగాణ.. తెలంగాణ అంటే ఒక మినీ ఇండియా అన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించామన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీకింద రూ. 10 లక్షలకు పెంచామన్నారు. రూ.2 లక్షల రైతు రుణామాఫీ చేయడం జరిగిందన్నారు. రూ.500 లకు గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ అందజేయడం జరుగుతుందన్నారు. త్వరలో గూడు లేని పేదల కోసం ప్రతి నియోజకవర్గంలో 3500 ఇళ్లు నిర్మించడం జరుగుతుందన్నారు. మహిళలను ఆర్థికంగా మరింత ముందుకు తీసుకవరావడమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకుసాగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి సీపీ డా. అనురాధ, జిల్లా అదనపు కలెక్టర్లు గరిమాఅగర్వాల్, శ్రీనివాస్‌రెడ్డి, వివిధశాఖల జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


గౌరవ వందనం చేస్తున్న మంత్రి పొన్నం, చిత్రంలో కలెక్టర్, సీపీ తదితరులు


బ్యాడ్మింటన్ టి.చాంపియన్ జట్టు

## బాల్ బ్యాడ్మింటన్ తెలంగాణ ఛాంపియన్‌గా మెదక్ ఉమ్మడి జిల్లా జట్టు

**మిరుదొడ్డి, సెప్టెంబర్ 17, ప్రభాతవార్త :** ఈనెల 14,15వ తేదీలలో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అండర్-15 పోటీల్లో ఉమ్మడి మెదక్ జిల్లా క్రీడాకారులు మంచి ప్రతిభను కనబర్చినట్లు మెదక్ ఉమ్మడి జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ జి.భైరయ్య తెలిపారు. బాలుర, బాలికల జట్టు అద్భుతంగా రాణించారని తెలిపారు. రసవత్తరంగా సాగిన పోటీల్లో జిల్లా క్రీడాకారులు గతంలో కంటే మంచి ప్రతిభను చూపించి బాలుర జట్టు ప్రథమ స్థానం సాధించిందన్నారు. బాలికల జట్టు తృతీయస్థానంలో నిలిచిందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ, అధ్యక్షులు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌రావు, అసోసియేషన్ బాధ్యులు శ్రీనివాస్‌రెడ్డి, పాశ, శరణప్ప తదితరుల ప్రోత్సాహంతో క్రీడాకారులు రాణించారని తెలిపారు. సీనియర్ నేషనల్ క్రీడాకారులు కిరణ్, వాసు, జలీల్, సంకల్ప వెల్ఫేర్ అభినందనలు తెలిపారు.

## ఓటరు జాబితాపై సమావేశం : ఎంపిడివో

**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 17, ప్రభాతవార్త:** రేపు ఓటరు జాబితాపై సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో దామోదర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికలసంఘం త్వరలో నిర్వహించే స్థానిక ఎన్నికల నేపథ్యంలో ఓటరు జాబితాను వార్డుల వారీగా ఆయా గ్రామాలలో అందుబాటులో ఉంచామని, గురువారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో అభ్యంతరాలు, ఎన్నికల నిర్వహణపై ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల మండలాధ్యక్షులు హాజరు కావాలని ఆయన తెలిపారు.

## ఘనంగా ప్రజాపాలన దినోత్సవ వేడుకలు

**నర్సాపూర్ రూరల్, సెప్టెంబర్ 17, ప్రభాతవార్త:** మండల పరిధి రెడ్డిపల్లి గ్రామంలో సెప్టెంబర్ 17 ప్రజాపాలన దినోత్సవ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సునిత, రెడ్డిపల్లి తాజా మాజీ ఉప సర్పంచి అశోక్‌గౌడ్, అంగన్‌వాడీ టిచర్లు హేమలత, ఆశాలు జ్యోతి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నేత చాకలి వెంకటి(వైఎస్) ఆకస్మిక మృతి మున్సిపాలిటీలో అలుముకున్న విషాధచాయలు

**రామాయంపేట మున్సిపాలిటీ, సెప్టెంబర్ 17, ప్రభాతవార్త :** రామాయంపేట మున్సిపాలిటీలోని 6వ వార్డుకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్‌నేత కోనాపురం చాకలి వెంకటి(వైఎస్)(48) మంగళవారం ఆకస్మికంగా మృతిచెందాడు. రెండు రోజుల క్రితం ఇంటివద్ద జారిపడిన వెంకటి తలకు దెబ్బతగిలింది. కుటుంబసభ్యులు వెంటనే హైదరాబాద్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ నేడు మృతిచెందాడు. చాలాకాలంగా ఆయన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా ఉన్నారు. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి అత్యంత అభిమానిగా పేరు తెచ్చుకున్న ఆయనను రామాయంపేటలోనే కాకుండా చుట్టుపక్కల గ్రామాల వారు వెంకటిని తనపేరుతో కాకుండా వైఎస్‌గానే గుర్తిస్తారు. రామాయంపేటలో అధికారంలో ఉన్నా, లేకున్నా కాంగ్రెస్ పార్టీని వీడకుండా కరుడు కట్టి కాంగ్రెస్‌వాదిగా పేరుతెచ్చుకున్న వెంకటి ఆకస్మికంగా మృతిచెందడంతో పట్టణంలో విషాదం నెలకొంది. కాంగ్రెస్ పార్టీలోనే కాకుండా వెంకటి బీసీ సంఘంలోనూ చురుకైన కార్యకర్తగా ఉంటూ మెదక్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షునిగా కొనసాగుతున్నారు. ఆయన మృతిపట్ల అన్ని పార్టీల నాయకులు, బీసీ సంఘాల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

## పోలీస్‌స్టేషన్‌లో ఆటోడ్రైవర్ ఆత్మహత్యాయత్నాం

**హత్నూర సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** పోలీసుల వేధింపులు భరించలేక ఓ యువకుడు పోలీస్‌స్టేషన్‌లో ఆత్మహత్య యత్నానికి పాల్పడిన సంఘటన మంగళవారం హత్నూర పోలీస్‌స్టేషన్‌లో జరిగింది. బాధితుని కుటుంబీకుల కథనం ప్రకారం.. హత్నూరమండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన పటేల్ విఠల్‌గౌడ్ ఆటోనడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం విఠల్‌గౌడ్ హత్నూర మండలం దౌల్తాబాద్ నుండి మల్కాపూర్‌కు ఆటోనడుపుకుంటూ వస్తున్నాడు. మార్గం మధ్యలో వెళుతున్న, ఆర్టీసి బస్సును ఓవర్ టేక్ చేసే విషయంలో బస్సుడ్రైవర్‌కు, ఆటోడ్రైవర్ విఠల్‌గౌడ్‌కు మధ్య గోడవ చోటుచేసుకుంది. బస్సు డ్రైవర్ పోలీసులకు ఫోన్‌చేయడంతో, పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, ఇరువురిని హత్నూర పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీస్‌స్టేషన్‌లో పోలీసులు విఠల్‌ను తిట్టడంతోపాటు కొట్టారని, ఇతరులతో ఎవరితో మాట్లాడకుండా అతని వద్దఉన్న సెల్‌ఫోన్‌ను, పోలీసులు తీసేసుకున్నారని, మనస్థాపానికి గురైన విఠల్, డీజిల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని అతని కుటుంబీకులు ఆరోపించారు. మంటలు చెలరేగడంతో అక్కడే ఉన్న పోలీసులు, స్థానికులు మంటలను ఆర్పీ, పటేల్ విఠల్‌గౌడ్‌ను చికిత్స నిమిత్తం నర్సాపూర్ ఆసుపత్రికి తరలించారని, అక్కడ చికిత్స చేసిన వైద్యులు, సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారని అతని బంధువులు తెలిపారు. మంటల్లో విఠల్‌గౌడ్ శరీరం నలభై శాతం కాలిందని బంధువులు పేర్కొన్నారు. ఈవిషయమై హత్నూర ఎస్ఐ సుభాష్‌ను వివరణ కోరగా ఆర్టీసి బస్సు డ్రైవర్‌కు, ఆటోడ్రైవర్‌కు మధ్య గొడవ జరిగిందని ఫోన్ రాగా, ఇద్దరిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి మాట్లాడేలోగానే విఠల్‌గౌడ్ డీజిల్ పోసుకున్నాడని అన్నారు. విఠల్‌గౌడ్‌ను పోలీసులు తిట్టలేదని, కొట్టలేదని, ఫోన్ లాక్కోలేదని అన్నారు. పోలీసుల వేధించారనే ఆరోపణల్లో వాస్తవంలేదని ఎస్ఐ సుభాష్ అన్నారు.

## మందు బాబుల బీభత్సం

**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 17, ప్రభాతవార్త:** మద్యం మత్తులో మందు బాబులు కారుతో బీభత్సం సృష్టించిన సంఘటన మండల పరిధిలోని మిర్జాపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. నార్సింగ్ మండలం శేరిపల్లి గ్రామానికి చెందిన యువకులు వినాయక నిమజ్జనంలో మందు తాగి కారుతో వేగంగా మదూర్ గ్రామానికి చెందిన రాజు గేదేను ఢీకొట్టారు. దీంతో గేదే కాలు విరిగిపోయింది. వాహనాన్ని ఆపకుండా వేగంగా వెళ్లి మిర్జాపల్లి సమీపంలో ఓ చెట్టుకు ఢీకొట్టడంతో యువకులకు గాయాలయ్యాయి. స్థానికులువెళ్లి కారులో చూడగా మద్యం సీసాలు ఉన్నాయని గుర్తించారు. యువకులు వారి మిత్రులకు సమాచారం అందించి అక్కడ నుండి వెళ్లిపోయారు. ఈ విషయమై చిన్నశంకరంపేట ఎస్ఐ నారాయణగౌడ్‌ను సంప్రదించగా ఫిర్యాదు రాలేదని తెలిపారు.


కారు చెట్టుకు ఢీకొట్టడంతో కిందపడిన యువకుడు



విశ్వకర్మ జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

## విశ్వకర్మ జయంతి వేడుకలు

నంగునూర్, సెప్టెంబర్ 17, ప్రభాతవార్త: విశ్వకర్మ జయంతి పురస్కరించుకొని మంగళవారం మండల పరిధిలోని పాలమాకులలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పంచ వృత్తి కులాల జెండాను ఆవిష్కరించి పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఉత్సవాలను జరుపుకున్నారు. అనంతరం సంఘం అధ్యక్షులు శ్రీనివాసాచారి మాట్లాడుతూ కులవృత్తులకు అదరణ కరువైందని ప్రభుత్వాలు ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో బ్రహ్మచారి, వెంకటేశ్వర్లు, రవి, కృష్ణ, యాదగిరి, వెంకటచారి, బాలరాజు,సిద్దయ్య, శివ, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

**కొల్చారంలో...**

**కొల్చారం, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త:** భగవాన్ విశ్వకర్మ జయంతిని మంగళవారం కొల్చారం గ్రామంలోని కాళికాదేవి ఆలయంలో వైభవోపేతం గా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విశ్వ బ్రాహ్మణులు మాట్లాడుతూ విశ్వకర్మ జయంతిని ప్రభుత్వపరంగా జరపాలని, అలాగే సెలవు దినంగా ప్రకటించాలన్నారు. ఈ క్యాక్రమంలో ఉపాధ్యక్షులు ప్రభాకరాచార్య, దశరథం చారి, పాండురంగా చారి, వీరస్వామి చారి, నర్సింలు చారి, ఈశ్వర్ చారి, కరుణాకర్ చారి, విశ్వ బ్రాహ్మణులు తదితరులు ఉన్నారు.

## టిపిటిఎఫ్ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి



ఆత్మీయ సమ్మేళనం కరపత్రాలను ఆవిష్కరిస్తున్న టిపిటిఎఫ్ నాయకులు

**గజ్వేల్, సెప్టెంబర్ 17 (ప్రభాతవార్త):** పట్టణంలోని ప్రజ్ఞా గార్డెన్‌లో ఈనెల 19వ తేదీ గురువారం నిర్వహించనున్న టిపిటిఎఫ్ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని టిపిటిఎఫ్ గజ్వేల్ జోన్ కన్వీనర్ సుంచు నరేందర్ కోరారు. మంగళవారం గజ్వేల్ జోన్ కార్యాలయంలో టిపిటిఎఫ్ ఆత్మీయ సమ్మేళనానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమ్మేళనం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇటీవల బదిలీ అయిన, పదోన్నతులు పొందిన, ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు పొందిన ఉపాధ్యాయులను సన్మానించడం జరుగుతుందని, ఉపాధ్యాయులు అందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాంచంద్రం, గజ్వేల్, జగదేవ్‌పూర్, వర్గల్, మర్కుక్, ములుగు మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తాళ్ల నాగరాజు, సత్తయ్య, పోచం, పర్వతం నర్సయ్య, పిల్లి రాములు, వెంకట్, శ్రీధర్, నాయకులు మధుసూదన్, చంద్రయ్య, ఎల్లయ్య, శంకర్, కరుణాకర్, లక్ష్మయ్య, వేణు, మీనయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## బైరాన్‌పల్లి అమరవీరులకు ఘన నివాళి



బైరాన్‌పల్లి బురుజు వద్ద నివాళులర్పిస్తున్న రైతు సంఘాల నాయకులు

**వర్గల్, సెప్టెంబర్ 17 (ప్రభాతవార్త):** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో బైరాన్‌పల్లి అమరవీరులకు తెలంగాణ విమోచన దినం సందర్భంగా మంగళవారం వర్గల్ మండల రైతు సంఘాల నాయకులు బైరాన్ పల్లిలోని బురుజు వద్ద ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశానికి స్వతంత్రం వచ్చినా తెలంగాణకు నైజాం నవాబు పెత్తందారులతో రజాకారుల కదంబ హస్తాలలో బందీగా ఉన్న తెలంగాణ విముక్తి కోసం వీరబైరాన్‌పల్లి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ఎంతో ఖ్యాతి పొందిందని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. నైజాం సైన్యాలు బైరాన్‌పల్లి బురుజు వద్ద 96 మందిని నిలబెట్టి మిషన్ గన్నులతో ఒకేసారి కాల్చిచంపిన సామూహిక హత్యాకాండను సాయుధ రైతాంగం తిప్పికొట్టి రాజాకారులను అనేకమార్లు తరిమికొట్టిన చరిత్ర బైరాన్‌పల్లి రైతాంగ సాయుధ పోరాటం చరిత్రకు ఎక్కిందన్నారు. బైరాన్‌పల్లి సాయుధ దళాల హెచ్చరికలతో నైజాం పోలీసు రజాకార్లు పారిపోయినట్లు చరిత్రలు ఉన్నాయని తెలిపారు. బైరాన్‌పల్లి అమరవీరులను స్మరిస్తూ ఘన నివాళులర్పించి జోహార్లు ప్రకటించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్‌రెడ్డి, మహిళ అధ్యక్షురాలు ఉమారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేలూరి కృష్ణారెడ్డి, రెడ్డి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వినాయకునికి 101 రకాల నైవేద్యాల సమర్పణ

**పెద్దశంకరంపేట, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త:** మాధవ్‌నగర్ కాలనీలో ప్రతిష్ఠించిన వినాయక మండపం వద్ద వినాయకుడికి 101 రకాల స్వీట్లను, వంటకాలను మంగళవారం మహిళలు, నిర్వాహకులు సమర్పించారు. ప్రత్యేకంగా పలు రకాల స్వీట్లతోపాటు వివిధ రకాల వంటకాలను తయారు చేసి స్వామి వారికి సమర్పించారు. వివిధరకాల పూలతోపాటు నైవేద్యాలను సర్వాంగ సుందర్భంగా అలంకరించి స్వామి వారి ముందు ఉంచారు.

## మున్సిపల్ కార్యాలయంలో ప్రజాపాలన దినోత్సవం

**-త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించిన మున్సిపల్ చైర్మన్ రాజమౌళి**

**గజ్వేల్ టౌన్, సెప్టెంబర్ 17 (ప్రభాతవార్త):** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ చైర్మన్ ఎన్.సి.రాజమౌళి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1948 సెప్టెంబర్ 17న హైద్రాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం కావడం జరిగిందన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, శ్రామిక జన విముక్తి కోసం తెలంగాణలో నిజాం నవాబుకు వ్యతిరేకంగా ఎన్నో ఉద్యమాలు జరిగాయని, సర్దార్ వల్లభాయ్‌పటేల్ నేతృత్వంలో ఆపరేషన్ పోలో ద్వారా సైనిక చర్య చేపట్టి ఇండియన్ యూనియన్‌లో నిజాం నవాబు లొంగిపోయిన రోజు అని, ఈ సందర్భంగా విలీన దినోత్సవము అని కొందరు, విమోచన దినోత్సవము అని కొందరు అంటూనే ఉన్నారని తెలిపారు. అయితే నేటి నుండి తెలంగాణ ప్రజాపాలన దినోత్సవముగా నిర్వహించాలని ఆదేశించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య, వైస్ చైర్మన్ జకియొద్దీన్, గజ్వేల్ పట్టణ బిఆర్ఎస్ అధ్యక్షుడు నవాజ్‌మీరా, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజమౌళి



రామాయంపేట జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న జితేందర్‌గౌడ్



అమీన్‌పూర్‌లో జెండాను ఆవిష్కరిస్తున్న తుమ్మల పాండురంగారెడ్డి



శివ్వంపేటలో జెండా ఎగరవేస్తున్న తహసిల్దార్ కమలాద్రి

# గ్రామ గ్రామాన మువ్వన్నెల జెండా రెపరెపలు

**రామాయంపేట/ రామాయంపేట మున్సిపాలిటీ, సెప్టెంబర్ 17, ప్రభాతవార్త :** రామాయంపేట మున్సిపాలిటీలో మంగళవారం ప్రజా పాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. రాష్ట్రం లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి సారిగా సెప్టెంబర్ 17ను ప్రజాపాలన దినోత్సవంగా జరుపుకోవాలని ఇచ్చిన ఆదేశాల మేరకు పట్టణంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. మున్సిపల్ కార్యాలయంలో చైర్మెన్ పల్లె జితేందర్‌గౌడ్, పిఎసిఎస్ కార్యాయలంలో పిఎసిఎస్ చైర్మెన్ బాదె చంద్రం, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రజినికుమారి, ఎక్సైజ్ కార్యాలయంలో ఎక్సైజ్ సీఐ రాణి తోపాటు ఆయా కార్యాలయాల్లో ఆయా శాఖల అధికారులు జెండాలు ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ పుట్టి విజయలక్ష్మి యాదగిరి, కౌన్సిలర్‌లు బొర్ర అనిల్‌కుమార్, సుందర్‌సింగ్, గజవాడ నాగరాజు, చంద్రపు శోభకొండల్‌రెడ్డి, దేమె యాదగిరి, మల్యాల కవితాకిషన్, దేవుని జయ రాజు, చింతల రాధాభవాని యాదగిరి, చిలుక గంగాధర్, సరాఫ్ సౌభాగ్య శ్యామ్, మున్సిపల్ కమీషనర్ దేవేందర్, మేనేజర్ శ్రీనివాస్, పిఎసిఎస్ డైరెక్టర్లు సుధాకర్‌రెడ్డి, పోచమ్మల ఐలయ్య, నరేందర్, నర్సింలు, సీఈవో పుట్టి నర్సింలు, కార్యాలయం సిబ్బంది శ్రీనివాస్, దుర్గారెడ్డి, కొండల్‌రెడ్డి, నరేష్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**అక్కన్నపేటలో...**

తెలంగాణ విమోచన దినం సందర్భంగా మంగళవారం అక్కన్నపేటలో బిజెపి మాజీ సర్పంచ్, బిజెపి జిల్లా కార్యదర్శి వెలుముల మహేశ్వరి సిద్దరాములు జాతీయజెండా ఎగురవేయడం జరిగింది.

**అమీన్‌పూర్‌లో...**

**అమీన్‌పూర్, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త:** అమీన్‌పూర్ మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ప్రాంతానికి నిరంకుశ పాలన నుంచి విముక్తి లభించిన సెప్టెంబర్ 17ను పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన దినోత్సవం నిర్వహిస్తుంది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో వైస్ చైర్మన్ నందారి నరసింహాగౌడ్ స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి మహనీయుల చిత్రపటాలకు పూలమాలతో నివాళులర్పించిన అనంతరం మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. జాతీయ గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవానందం, మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మాజీ సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

**శివ్వంపేట మండలంలో...**

**శివ్వంపేట, సెప్టెంబర్ 17 ( ప్రభాతవార్త) :** మండలంలో సెప్టెంబర్ 17న ప్రజాపాలన దినోత్సవం పురస్కరించుకొని ఆయా కార్యాలయాలలో పాఠశాలలో జెండా ఎగరవేసి ఘనంగా ప్రజాపాలన దినోత్సవం వేడుకలు జరుపుకున్నారు. తహసిల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ కమలాద్రి, ఎంపిడివో కార్యాలయం వద్ద ఎంపిడివో నాగేశ్వర్‌గుప్త, పోలీస్ స్టేషన్ వద్ద ఎస్సై మహిపాల్ రెడ్డి, పిఎసిఎస్ కార్యాలయం వద్ద పిఎసిఎస్ చైర్మన్ వెంకట్రాంరెడ్డి, ప్రభుత్వ పాఠశాల వద్ద ప్రధానోపాధ్యాలు బాలచంద్రం ప్రభుత్వ హాస్పిటల్ వద్ద డాక్టర్ సాయి సౌమ్య, కాస్తూర్భాగాంధీ పాఠశాల వద్ద ప్రధానోపాధ్యాయురాలు మంజుల, ఎంఈఓ కార్యాలయం వద్ద ఎంఈఓ బుచ్చా నాయక్, వ్యవసాయకార్యాలయంవద్ద ఏవో లావన్య జాతీయ జెండాను ఎగరవేసి ప్రజాపాలనదినోత్సవం జరుపుకున్నారు.

**దేవాలయ కార్యాలయంలో...**

**కొమురవెల్లి, సెప్టెంబర్ 17, ప్రభాతవార్త :** తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ ఆదేశాల మేరకు కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయ కార్యాలయంలో ఈవో బాలాజీ చేతుల మీదుగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్; ఏఈవో శ్రీనివాస్, పర్యవేక్షకులు సురేందర్,శ్రీరాములు, విద్యుత్ విభాగం ఎఈ భాస్కరరావు, దేవాలయ సిబ్బంది, అర్చకులు, ఒగ్గు పూజారులు, దేవాలయ వేద విద్యార్థులు పాల్గొన్నారు.



వాగును పరిశీలిస్తున్న దృశ్యం

## వాగుపై వెంటనే బ్రిడ్జి నిర్మించాలి

**కొమురవెల్లి, సెప్టెంబర్ 17, ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఐనాపూర్ నుంచి రాంసాగర్ పెదరాజపేట పెద్ద చెరువుకు వెళ్లేదారిలో వాగు ఉండడంతో ప్రజల రాకపోకలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మాజీ సర్పంచ్ చెరుకు రమణారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన రైతులతో కలిసి వాగును పరిశీలించి మాట్లాడారు. కొంత కాలం నుంచి ప్రజలు,రైతులు వాగుపై బ్రిడ్జి లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని..ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వెంటనే బ్రిడ్జి నిర్మించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, రైతులు కాగిత మోహన్‌రెడ్డి, దండు నర్సింహులు, ఎర్పుల కనకయ్య, కొమ్ము రాములు, ఏర్పుల గోపాల్, దండు రవి, బొమ్మకంటి స్వామి, కొమ్ము కనకయ్య, బక్కి రాందాస్, కొమ్ము యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## చిరుధాన్యాలు, అకుకూరలతో సంపూర్ణ పోషకాహారం

**సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్ 17, ప్రభాతవార్త :** చిరుధాన్యాలు సహజ సిద్దంగా లభించే ఆకుకూరలు తీసుకోవడం వలన శరీరానికి కావాల్సిన సంపూర్ణ పోషకాహారాలు అందుతాయని ఐసిడిఎస్ ఎసిడిపివో ఛాయాదేవి అన్నారు. మంగళవారం అర్బన్ మండల పరిధిలోని తడకపల్లిలో సెక్టార్ లేవల్ పోషణ మాస ఉత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్స్ బాలింతలకు,గర్భవతులకు పోషణ ఆహారం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. చిరుధాన్యాలు తీసుకుంటే కలిగే లాభాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని అంగన్‌వాటీ టీచర్స్‌కు సూచించారు. వివిధ రకాల ఆకుకూరలతో చిరుధాన్యాలతో తయారు చేసిన పదార్థాలను ప్రదర్శించి తల్లులకు, గర్భవతులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలకు పౌష్టికాహారం అందించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వసంత, ఎఎన్ఎం, అంగన్‌వాడీ టీచర్స్ కృష్ణవేణి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## తంగళ్లపల్లిలో భక్తిశ్రద్ధలతో విశ్వకర్మ జయంతి

**కోహెడ, సెప్టెంబర్ 17, ప్రభాతవార్త :** విరాట్ విశ్వకర్మను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలని మండల పరిధిలోని తంగళ్లపల్లి శ్రీ మద్విరాట్ పోతులూరి విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు మీర్జాపురం లింగమూర్తిచారి సూచించారు.మంగళవారం తంగళ్లపల్లి విశ్వబ్రాహ్మణ సంఘంలో విరాట్ విశ్వకర్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సృష్టికి ముందే విరాట్ విశ్వకర్మ జన్మించారన తెలిపారు. సమాజానికి అవసరమైన వివిధ వృత్తులను ఆయన సృష్టించారని తెలిపారు. ఆయన చేసిన సేవల పట్ల విశ్వ కర్మ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు కుమారస్వామిచారి, భాస్కర్‌చారి, కిషన్‌చారి, లింగం చారి, శ్రీనివాసచారి, బాలయ్యచారి, చంద్రమౌళిచారి, సంపత్‌చారి, శ్రీకాంత్ చారి, రాకేష్‌చారి, శ్రవణ్‌చారి, నరసింహచారి, చిన్న బాలయ్యచారి పాల్గొన్నారు.



విశ్వకర్మ జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం



బిజెపి సభ్యత్వాలు అందచేస్తున్న సుధాకర్‌రెడ్డి

## వల్లభాయ పటేల్‌తో నిజాం పాలనకు విముక్తి

**జహీరాబాద్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** నిజాం పాలన నుంచి సర్దార్ వల్లభాయ్ పటేల్ తెలంగాణకు విముక్తి కల్పించారని మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కర్ణాటక బీదర్ పట్టణంలో తెలంగాణ విమోచన దినోత్సవంలో పాల్గొని జహీరాబాద్‌కు వచ్చిన సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నిజాం రాచరిక వల్ల ఎంతో మంది అమాయక ప్రజలు అమరులయ్యారని విచారం వ్యక్తం చేశారు. వికసిత్ భారత్ పేరుతో దేశాన్ని ప్రపంచంలోనే గుర్తింపు వచ్చేలా చేసిన ఘనత నరేంద్ర మోదికే దక్కుతుందన్నారు.

**చురుకుగా బిజెపి సభ్యత్వ నమోదు...**

భారతీయ జనతా పార్టీ సభ్యత్వ సమోదు కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా పలువురు బిజెపి నాయకులకు సుధాకర్‌రెడ్డి సభ్యత్వాలను అందించి నమోదును ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో బిజెపి నాయకులు పైడి ఎల్లారెడ్డి, జనార్ధన్‌రెడ్డి, విజేందర్‌రెడ్డి, గొల్ల భాస్కర్, కృష్ణారెడ్డి, ప్రొద్దుటూరు శ్రీనివాస్‌గుప్తా, అల్లాడి బక్కయ్య గుప్తా, బంటు విశ్వనాథం, సురేష్ పూరి, పూల జగన్నాథ్‌రెడ్డి, పూల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్‌గా ఖలీద్ శరీన్

**బెజ్జంకి, సెప్టెంబర్ 17, ప్రభాతవార్త :** మండల పరిధిలోగల ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్‌గా ఖలీద్ శరీన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అలాగే బదిలీపై వచ్చిన పీజీటి ఉపాధ్యాయుల,10 టీజీటీ ఉపాధ్యాయులు నలుగురు బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు బాధ్యతలు స్వీకరించిన వారిని శాలువాలతో సత్కరించారు.

## ఘనంగా నరేంద్ర మోది జన్మదిన వేడుకలు

**అల్లాదుర్గం, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో మంగళవారం భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోది జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలోని బిజెపి కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన జన్మదిన కేక్‌ను నాయకులు కట్‌చేసి నోటిని తీపి చేసుకున్నారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు కాల రాములు, మండల అధ్యక్షులు యాదగిరి, నాయకులు బ్రహ్మం, సాయిలుగౌడ్ పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

**మునిపల్లి, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన అజయ్‌కుమార్‌ను మంగళవారం ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. మండలపరిధిలోని పెద్దచెల్మెడ ఎంపిపిఎస్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు,ప్రధానోపాధ్యాయులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు నాగభూషణం, వీరేశం, కిష్టయ్య, సోమలింగం, విఠల్ రేణుక, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉత్తమ ఉపాధ్యాయుడు అజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



జాతీయ పతాకావిష్కరణ చేస్తున్న దొంత నరేందర్

## పోరాట యోధులను స్మరించుకుందాం

**-టిఎన్‌జివో మెదక్ జిల్లా అధ్యక్షులు దొంత నరేందర్**

**మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులను స్మరించుకుందామని టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షులు దొంత నరేందర్ అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా టీఎన్జీవో భవన ఆవరణలో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకావిష్కరణ గావించి మాట్లాడారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ తీసుకున్న సైనిక చర్యల నిర్ణయాల వల్ల నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తి లభించి తెలంగాణ ప్రాంత ప్రజలకు పూర్తి స్వేచ్ఛ స్వాతంత్ర్యాలతో భారతదేశంలో విలీనమైన రోజు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ శ్రీనివాసరావు, టీఎన్జీవో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గాండ్ల అనురాధ, జిల్లా సహాధ్యక్షులు ఎండి. ఇక్బాల్ పాషా, సంయుక్త కార్యదర్శులు పోతరాజు శంకర్, కిరణ్ కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఫోరం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యాదగిరిగౌడ్, మొగులయ్య, ఏఈఈ శ్రీహరిగౌడ్, సత్యనారాయణ, సంతోష్, హరికృష్ణ తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

## మోడీ నాయకత్వంలో దేశం అభివృద్ధి : కోణం విఠల్

**పెద్దశంకరంపేట, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని మండల బీజేపీ అధ్యక్షులు కోణం విఠల్ అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినం పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మండల బీజేపీ అధ్యక్షులు కోణం విఠల్ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవ భారత నిర్మాణమే ధ్యేయంగా భారతదేశ అభివృద్ధికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నిరంతరం కృషి చేస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి వేదశ్రీ, వైద్యులు శ్రీనివాస్, వైద్య సిబ్బంది యాదయ్య, బుగుడాల సాయిలు, మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి బండల శ్రావణ్ కుమార్, నాయకులు మంగళ కృష్ణ, వెంకయ్య, నారాయణ, భూమేష్, రమేష్‌చ శివ, సాయిలు, వెంకట సాయి తదితరులు పాల్గొన్నారు.

## మాధవానంద స్వామిని దర్శించుకున్న కాంగ్రెస్ నేతలు

**కొల్చారం, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త:** మండల పరిధిలోని రంగంపేట గ్రామ శివారులోని మదనానంద ఆశ్రమంలో మంగళవారం పీఠాధిపతి శ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామి వారిని నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ఆవుల రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రెడ్డిపల్లి ఆంజనేయులు గౌడ్ దర్శించుకొని స్వామి వారి ఆశీర్వాదాలు పొందారు. అంతకుముందు ఆశ్రమంలోని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగులగారి మల్లేశంగౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు యెల్లుగారి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీశైలం, రంగంపేట గ్రామ కమిటీ అధ్యక్షులు గొండ కృష్ణ, వెంకట్‌గౌడ్, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## సాంప్రదాయ బద్దంగా గణనాథుని నిమజ్జనం

**శివ్వంపేట, సెప్టెబర్ 17 ( ప్రభాతవార్త) :** మండలంలోని చిన్నగొట్టిముక్ల గ్రామ శివారులో గల ప్రసిద్ది పుణ్యక్షేత్రమైన చాకరిమెట్ల అంజనేయస్వామి ఆలయంలో ప్రతిష్టించిన మట్టి గణనాథుడికి నవరాత్రులు పుజలు చేసి సాంప్రదాయ బద్దంగా ఎడ్లబండిలో గణనాథుడిని ఊరేగించి చెరువులో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఫౌండర్ చెర్మన్ అంజనేయ శర్మ మాట్లాడుతు మట్టి గణేష్‌లను ప్రతిష్టించడం వల్ల పర్యావరణాన్ని రక్షించుకోవచ్చని సాంప్రదాయ భక్తి భజనలతో ఎడ్లబండిలో గణనాథుడిని ఊరేగించి గణనాథుని గంగమ్మ వాడికి చేర్చమని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ సార శ్రీనివాస్, వేదపండితులు దేవదత్తు శర్మ, ప్రభురాజ శర్మ, శ్రీవాస్తవ శర్మ ,ఆలయ సిబ్బంది రామకృష్ణ,శ్రీనివాస్,డాక్టర్ మహేష్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## సిద్దిపేట ప్రాంతం మతసామరస్యానికి ప్రతీక

**సిద్దిపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అత్తు**

**సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్ 17, ప్రభాతవార్త :** సిద్దిపేట ప్రాంతం మతసామరస్యానికి ప్రతీక అని సిద్దిపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్(అత్తు) అన్నారు. సిద్దిపేట పట్టణంలోని 9వ వార్డులలో బాలగణేష్ ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో గత మూడు పర్యయాలుగా లడ్డు వేలం పాటలో పాల్గొని లడ్డును దక్కించుకొని ప్రజలకు ప్రసాదంగా మంగళవారం అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విఘ్నేశ్వరుని దీవెనలతో కాంగ్రెస్ ప్రభుత్వంలో సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజలందరికీ న్యాయం జరిగి తీరుతుందన్నారు.సిఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. విఘ్నేశ్వరని దీవెనలతో కాంగ్రెస్ ప్రభుత్వం మరో 10 యేండ్ల పాటు కొనసాగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే అందరికీ న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ధు, గయాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలి : ఎమ్మెల్యే

**రాయపోల్, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త :** అనంత పద్మనాభ స్వామి దయవల్ల ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాయపోల్ మండలం ఎల్కల్ గ్రామంలోని అనంత పద్మనాభస్వామి ఆలయంలో అనంత చతుర్థశ మహోత్సవాన్ని పురస్కరించుకొని సుదర్శన హోమం, స్వామి వారి కళ్యాణం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన ప్రభుత్వమని చెప్పుకొని మాటలకే పరిమితమై ప్రజాపాలనను గాలికి వదిలేసి హైడ్రా పేరుతో కాలయాపన చేస్తూ కొత్త డ్రామాకు తెర లేపిందన్నారు.ఏ గ్రామంలో చూసిన రోడ్లు సరిగ్గా లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని,రోడ్ల మరమత్తులకు దరఖాస్తు చేస్తే వాటికి నిధులు మంజూరు చేయడం లేదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో గ్రామాల్లో రోడ్ల పనులకు మరమ్మతులు చేసుకున్నామని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సమస్యలను గాలికి వదిలేసి సెక్రటేరియట్ ముందు రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టారన్నారు. రేవంత్‌రెడ్డి సీఎం పదివిలో కుర్చోవడం కేసీఆర్ పెట్టిన భిక్షనేని అన్నారు.14 సంవత్సరాలు తెలంగాణ కోసం కొట్లాడి రాష్ట్రాన్ని సాధిస్తే రేవంత్‌రెడ్డి తెలంగాణకు సీఎం అయ్యావన్నారు. నేను ఎమ్మెల్యేగా గెలిచప్పటి నుండి రాయపోల్ మండలంలో ఒక్క కొబ్బరికాయ కొట్టిన దాఖలాలు లేవన్నారు. నయాపైసా నిధులు ఇవ్వలేదని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కాపాడుకున్నామన్నారు. ఈ రోజు ఏ గ్రామంలో చూసిన రోడ్లపై చెత్త చెదారంతో గ్రామాలు కంపు కొడుతున్నాయని, గ్రామంలోని వాటర్ ట్యాంక్ కడగాలంటే బ్లీచింగ్ పౌడర్‌కు కూడా గ్రామ పంచాయతీలో నిధులు లేవన్నారు.మురికి కాలువలు శుభ్రం చేయక విష జ్వరాలతో పేద ప్రజలు ఆస్పత్రుల పాలై అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇలాంటి పరిస్థితి పది సంవత్సరాల కాలంలో ఎప్పుడూ లేదన్నారు.రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అవ్వడం వల్ల తెలంగాణ రాష్ట్ర 20 సంవత్సరాలు వెనుకకు వెళ్లిందన్నారు.బీఆర్ఎస్ కార్యాలయాల్లో జిల్లెడు చెట్లు మొలుస్తాయని మాట్లాడుతుండని,జిల్లెడు చెట్లు మొలిచేది బీఆర్ఎస్ కార్యాలయాల్లో కాదని, గాంధీభవన్‌ల్లోనే జిల్లెడు చెట్లు,గడ్డి మొలుస్తుందని అన్నారు.బీఆర్ఎస్ కార్యాలయాల్లో శ్రీగంధపు చెట్లు పెట్టుకునేస్థాయిలో నాయకులు ఉన్నారని అన్నారు. జిల్లెడు చెట్లుపెట్టేది కాంగ్రెస్ నాయకులేనని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు వెంకటేశ్వర శర్మ,మాజీ జడ్పీటీసీ లింగాయపల్లి యాదగిరి, రాజిరెడ్డి, ఇప్ప దయాకర్, కల్లూరి శ్రీనివాస్, వెంకటయ్య, కరుణాకర్, మద్ద ప్రవీణ్ కుమార్, బచ్చు శివ, రాములు స్వామి, పెయింటర్ రవి, ఉప్పరి స్వామి, నవీన్ పాల్గొన్నారు



ములుగు ఎంపిడిఓ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం

## ములుగు మండలంలో ప్రజాపాలన దినోత్సవం

**ములుగు, సెప్టెంబర్ 17 (ప్రభాతవార్త):** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మంగళవారం ములుగు మండలంలో ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ఉద్యానవన విశ్వవిద్యాలయంలో ఉపకులపతి నీరజ ప్రభాకర్, మండలకేంద్రమైన ములుగులోని తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ ప్రవీణ్‌రెడ్డి, ఎంపిడిఓ కార్యాలయం వద్ద ఎంపిడిఓ శర్మ, పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ విజయ్‌కుమార్, పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. అలాగే మండలంలోని గ్రామపంచాయతీలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో త్రివర్ణ పతాకాలను ఆవిష్కరించి జెండా వందనం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## విశ్వకర్మ యజ్ఞంలో పాల్గొన్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి




విశ్వకర్మ భగవాన్‌కు పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

**గజ్వేల్, సెప్టెంబర్ 17 (ప్రభాతవార్త):** విశ్వకర్మలను ప్రభుత్వం ఆదుకోవాలని ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ముట్రాజ్‌పల్లి జర్నలిస్టు కాలనీ సమీపంలో గల బ్రహ్మంగారి గుట్టపై విశ్వకర్మ మనుమయ సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గణపతిపూజ, పుణ్యహావాచనం, విశ్వకర్మ భగవాన్‌కు చతుష్షష్ట్యోపచార పూజలు నిర్వహించడంతో పాటు పంచకుండాత్మక పద్ధతిలో విశ్వకర్మ యజ్ఞం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి మాట్లాడుతూ విశ్వకర్మలు విశ్వకర్మ జయంతి నిర్వహించడం సంతోషంగా ఉందని, విశ్వకర్మలను ఆర్థికంగా ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో విశ్వకర్మలకు గజ్వేల్ పట్టణంలో కమ్యూనిటీహాల్ నిర్మానం కొరకు నిధులు మంజూరు చేయడం జరిగిందని, అసంపూర్తిగా ఉన్న కమిటీ హాల్‌ను ప్రభుత్వం నిధులు మంజూరుచేసి పూర్తి చేయాలన్నారు. ఈ యజ్ఞ కార్యక్రమంలో మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డితో పాటు గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, డాక్టర్ నరేష్‌బాబు, డాక్టర్ వాసవాచారి, డాక్టర్ పెంటాచారి తదితరులు పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వకర్మ మనుమయ సంఘం అధ్యక్షుడు గడియారం వెంకటాచారి, ప్రధాన కార్యదర్శి విఠల్‌చారి, ఉపాధ్యక్షుడు గడియారం వెంకటేశంచారి, కోశాధికారి అరుణోజు లక్ష్మీనర్సింహాచారి, గడియారం నాగరాజుచారి, సహాయ కార్యదర్శి గడియారం స్వామిచారి, పల్లెపహాడ్ మాజీ సర్పంచ్ కొక్కొండ శ్రీనివాస్‌చారి, అరుణోజు శ్రీనివాస్‌చారి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో గాంధీలు పోయి గాడ్సేలు వచ్చారు

**-దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి**



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

**గజ్వేల్, సెప్టెంబర్ 17 (ప్రభాతవార్త):** ఒకప్పుడు కాంగ్రెస్‌లో గాంధీలు ఉండేవారని, నేడు వారిస్థానంలో గాడ్సేలు వస్తున్నారని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికారం శాశ్వతం కాదని, అహంకారంతో వ్యవహరిస్తే పాతాళంలోకి పోవడం ఖాయమని పేర్కొన్నారు. కెసిఆర్ నాయకత్వంలో అమరవీరుల త్యాగాలతో తెలంగాణ ఏర్పాటు జరిగిందని, కెసిఆర్ రాష్ట్రం సాధిస్తేనే నేడు సిఎం రేవంత్‌రెడ్డి అయ్యాడన్నారు. కెసిఆర్ మీద రేవంత్‌రెడ్డి ఇష్టంవచ్చినట్లు మాట్లాడడం మంచిదికాదన్నారు. బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కాదు గాంధీభవన్‌లో మీ గాడ్సేలే జల్లెడ విత్తనాలు నాటుతున్నారని, త్వరలో మొక్కలవుతాయన్నారు. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు చూస్తే తులసి వనంతో గంజాయి మొక్కలా ఉందన్నారు. నాడు తెలంగాణ బలి దేవత అన్న రేవంత్‌రెడ్డి నేడు బలి దేవత భర్త విగ్రహాన్ని ఎలా పెడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి, వైస్ చైర్మన్ జకియోద్దీన్, మాజీ జెడ్‌పిటిసి పంగ మల్లేశం, కౌన్సిలర్లు వంటేరు గోపాల్‌రెడ్డి, బబ్బూరి రజితగౌడ్, బాలమణి, నవాజ్‌మీరా, బెండె మధు, దేవి రవీందర్, ఆకుల దేవేందర్, రాజిరెడ్డి, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

## గోంగ్లూర్‌లో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

**పుల్కల్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** మండల పరిధిలోని గోంగులూరు గ్రామంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవ శిబిరం-స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా ప్రజా పాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామపంచాయితీ, పశు వైద్యశాల, గాంధీ భవన్, రైతు వేదికలలో జాతీయ జండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శులు, మాజీ సర్పంచ్‌లు, అంగన్‌వాడి టీచర్లు, ఆశా వర్కర్లు, ఎన్ఎస్ఎస్ కార్యాలయ ఇంచార్జులు, డాక్టర్ లక్ష్మి చల్లా, డాక్టర్ సుప్తొ సర్కార్, డిఎటిటిసి శాస్త్రవేత్త రాహుల్, ఏట చైతన్య, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## వినాయకునికి ఘనంగా పూజలు

**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 17, ప్రభాతవార్త:** మండల పరిధి కొర్విపల్లిలోని వినాయక మండపంలో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు మంగళవారం పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా ప్రజలపై వినాయకుని ఆశీస్సులు ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్న ఈ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. అందరి జీవితాల్లో విఘ్నాలు తొలగి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. చిన్నశంకరంపేట పట్టణంలో అనంత పద్మనాభ స్వామి దేవాలయంలో చతుర్దశి పూజలు నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులను చెల్లించుకున్నారు.

## ఘనంగా విశ్వకర్మ జయంతి

**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 17, ప్రభాతవార్త:** మండలంలో మంగళవారం విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలో ఉన్న పరిశ్రమలలో విశ్వకర్మ జయంతిని నిర్వహించారు. పట్టణంలో ఉన్న రాధా స్టీల్ పరిశ్రమలో యజమానులు సునీల్ షరాఫ్, సుమన్ షరాఫ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వారు మాట్లాడుతూ విశ్వాన్ని సృష్టించి విశ్వకర్మ ఆశీస్సులతో పరిశ్రమ లాభాల బాటలో నడుస్తూ పది మందికి ఉపాధి కల్పించే అవకాశం వచ్చిందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి రాజిరెడ్డి, ఆర్పీసింగ్, నాయకులు శ్రీమాన్, నారాయణరెడ్డి, కిష్టయ్య పరిశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.



పుల్కల్‌లో జండాను ఆవిష్కరిస్తున్న అధికారులు



వెల్దుర్తిలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న తహశీల్దార్ కృష్ణ



కొల్చారంలో జెండాను ఆవిష్కరిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ మల్లేశంగౌడ్

# ఘనంగా ప్రజా పాలన దినోత్సవం

**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 17, ప్రభాతవార్త:** ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా చిన్నశంకరంపేటలో జాతీయ జెండాను ఎంపీడీవో దామోదర్ మంగళవారం ఆవిష్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు అమరవీరుల స్థూపం వద్ద జెండాను ఆవిష్కరించి నివాళులర్పించారు. బిజెపి మండలాధ్యక్షుడు పోగుల రాజు పార్టీ కార్యాలయం ముందు జెండాను ఎగురవేశారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్ళు అర్పించారు. అలాగే అమరవీరుల స్థూపం వద్ద బిఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు పట్లోరి రాజు జెండాను ఆవిష్కరించారు. అలాగే మండల వ్యాప్తంగా పంచాయతీ కార్యాలయాల ముందు జెండాను ఆవిష్కరించారు. స్వచ్ఛతాహి సేవలో బాగంగా ప్రతిజ్ఞ చేశారు. 'ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎందరో అమరుల త్యాగ ఫలితం వల్ల రాష్ట్రం సిద్దించిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో విభిన్న మతాలు, కులాలు కలిసి ఉంటాయన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**పుల్కల్‌లో...**

**పుల్కల్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** ఉమ్మడి పుల్కల్ మండంలో మంగళవారం ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి బాలరాజ్, తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ కృష్ణ, పోలీసు ఠాణాలో ఎస్.పాటిల్ క్రాంతికుమార్, వ్యవసాయ కార్యాలయం వద్ద ఏఓ చైతన్యలు జాతీయ జండాలను ఆవిష్కరించారు. ఇదిలా ఉండగా చౌటకూరు మండలంలోని సుల్తాన్‌పూర్ జెఎన్‌టీయు ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ జి నరసింహ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. చౌటకూరు పంచాయితీ కార్యాలయం వద్ద పంచాయితీ కార్యదర్శి సందీప్‌గౌడ్ జండాను ఆవిష్కరించారు.

**వెల్దుర్తి మండలంలో...**

**వెల్దుర్తి, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో ప్రజా పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్ కృష్ణ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో ఉమాదేవి, పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్ఐ రాజు, స్త్రీ శక్తి భవనం వద్ద మహిళా మండలి అధ్యక్షులు భవాని, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిమ హామీ భవనం వద్ద ఎంపీడీవో ఉమాదేవి, వ్యవసాయ కార్యాలయం వద్ద విస్తరణ అధికారి వందన, ప్రభుత్వ ఆసుపత్రి వద్ద డాక్టర్ శిరీషలు జాతీయ జెండాను ఎగురవేశారు. అలాగే స్థానిక గ్రామ పంచాయితీ వద్ద ప్రత్యేకాధికారి, తహశీల్దార్ కృష్ణ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నరేందర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేష్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్, మాజీ అధ్యక్షులు నర్సింహారెడ్డి, వార్డు సభ్యులు పోతరాజు కుమార్, ఆర్ఐ జయభారత్‌రెడ్డి, గ్రామ పంచాయితీ ఈవో బలరాంరెడ్డి, జిల్లా మహిళా మండలి అధ్యక్షురాలు ముక్తాబాయి, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ రాములతో పాటు పలువురు పాల్గొన్నారు.



సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బిజెపి నాయకులు




అమరవీరుల స్థూపంవద్ద నివాళుర్పిస్తున్న కాంగ్రెస్‌నేతలు

**కొల్చారంలో...**

**కొల్చారం, సెప్టెంబర్17 ప్రభాతవార్త:** ప్రజా పాలన దినోత్సవ సందర్భంగా మంగళవారం మండల పరిధిలోని కిష్టాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం ముందు చైర్మన్ నాగులగారి మల్లేశంగౌడ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీఈవో నవీన్, డైరెక్టర్లు నారాయణ, డాకాగౌడ్, పోచయ్య, ప్రమీల, శ్రీరాములు, అటెండర్ యాదగిరి పాల్గొన్నారు.



తిలక్‌నగర్‌లోని వినాయకుడికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

## సందడిగా గణపతుల నిమజ్జన వేడుకలు: ఎమ్మెల్యే

**హైదరాబాద్, సెప్టెంబరు 17 ప్రభాతవార్త :** నగరంలో ఎక్కడ చూసినా గణేషుల నిమజ్జన వేడుకల సందడి నెలకొందని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. గురువారం అంబర్‌పేట నియోజకవర్గంలో పర్యటించారు. మండప నిర్వాహకులతో మాట్లాడి నిమజ్జన వేడుకలను పర్యవేక్షించారు. స్వాగత వేదికలపై నుంచి గణనాథులకు స్వాగతం పలికారు. అందకుముందు నల్లకుంట డివిజన్, తిలక్‌నగర్‌లో నిమజ్జన వేడుకల్లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ ఉత్సవాల్లో భక్తి, దేశభక్తి కలసి ఉంటాయన్నారు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి పోరాటంతో ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనం జరుగుతుందన్నారు. అయితే బిజెపి గణేష్ నవరాత్రుల వేడుకలను కూడా రాజకీయ అవకాశాలకు వినియోగించుకుంటుందన్నారు.

### బాగ్‌లింగంపల్లిలో రూ.57వేలకు లడ్డూ దక్కించుకున్న లింగారెడ్డి

**చిక్కడపల్లి, సెప్టెంబరు 17 ప్రభాతవార్త:** బాగ్‌లింగంపల్లిలో నైబర్‌హుడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సిరిగిరి కిరణ్ ఆధ్వర్యంలో స్థానిక కమ్యునిటీ హాల్‌లో నిర్వహించిన గణపతి నవరాత్రోత్సవాల సందర్భంగా లడ్డూవేలంలో మండపం పూర్వ అధ్యక్షుడు లింగారెడ్డి రూ.57వేలకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ కార్పొరేటర్, బిఆర్ఎస్ రాష్ట్ర నేత వి.శ్రీనివాస్‌రెడ్డి హాజరై లింగారెడ్డిని సత్కరించి అభినందించారు. అసోసియేషన్ కోశాధికారి కేశవ్‌రెడ్డి, పూర్వ అధ్యక్షుడు శేఖర్, సంయుక్త కార్యదర్శి శ్రీశైలం, బిఆర్ఎస్ నేతలు రేషం మల్లేష్, నేతా శ్రీనివాస్, సిరిగిరి శ్యామ్, నాయిని దేవేందర్‌రెడ్డి, సోను తదితరులు పాల్గొన్నారు.

## ఆది కార్మికుడు విశ్వకర్మ

**చిక్కడపల్లి, సెప్టెంబరు 17 ప్రభాతవార్త:** ఆది కార్మికుడు విశ్వకర్మ అని వక్తలు కీర్తించారు. మంగళవారం చిక్కడపల్లి శ్రీత్యాగరాయ గానసభ సమీపంలో విశ్వకర్మ జయంతి కార్యక్రమం ఆలిండియా విశ్వకర్మ యూత్ ఫెడరేషన్ ముషీరాబాద్ అధ్యక్షుడు బిజ్జారం వీరభద్రాచారి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో అతిథులుగా గాంధీనగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అభిషేక్ కెన్నడీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు శీలం సత్యనారాయణ, గుర్రం శంకర్, మారిశెట్టి నర్సింగరావు, గడ్డం రాజేష్, జగదీశ్ బాబు, దోనేటి సత్యం, సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనిముట్లు సృష్టించిన విశ్వకర్మ విష్ణుచక్రం, హనుమంతుడి గద, కత్తి, సుత్తి, కొడవలి ఇలా అన్ని కుటీర పరిశ్రమలకు అవసరమయ్యే సాధనాలు కనిపెట్టింది విశ్వకర్మ అని అన్నారు. ఇంద్రభవనం నిర్మించిన ఇంజనీరింగ్ విశ్వకర్మ అని, వాస్తుశిల్పి విశ్వకర్మ శిష్యుడు మయుడు మయసభ నిర్మించారన్నారు. కార్మిక వ్యవస్థకు పురుడు పోసింది విశ్వకర్మ కావడం అయినందువల్ల విశ్వకర్మ జయంతిని ఘనంగా జరుపుకుంటున్నామన్నారు.

## తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను భవిష్యత్తు తరాలకు ప్రభుత్వాలు తెలియజేయాలి

**సైఫాబాద్, సెప్టెంబరు 17 ప్రభాతవార్త:** తెలంగాణ సాయుధ పోరాటాన్ని స్మరించుకుంటూ మంగళవారం హిమాయత్‌నగర్‌లో సిపిఐ హైదరాబాద్ జిల్లా సమితి కౌన్సిల్ ఏర్పాటు చేసిన పోరాట వీరుల కటౌట్‌కు నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్. ఛాయాదేవి మాట్లాడుతూ భూస్వామ్య, నిరంకుశ రాచరిక నిజాం పాలనకు వ్యతిరేకంగా దోపిడీ, పీడనకు గురవుతున్న సాధారణ ప్రజలనుంచి మొదలుకొని బుద్ధిజీవులుగా ఉన్న మేధావుల వరకు సాయుధ పోరాటాన్ని నిర్వహించారని తెలిపారు. ఈ పోరాటంలో వేలాది మంది తమ అమూల్యమైన ప్రాణాలను తృణప్రాయంగా వదులుకున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చరిత్రను భవిష్యత్తు తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైన ఉందన్నారు. ఇంతటి మహోన్నతమైన పోరాటాల్లో పాల్గొన్న వారికి పెన్షన్ చెల్లించాలని 1999లో ఆనాటి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి విద్యాసాగర్‌కు విజ్ఞప్తి చేయడం జరిగిందని, కాని వారి దరఖాస్తులను తిరస్కరించిన చరిత్ర బిజెపిదని, ప్రస్తుతం ఏ మాత్రం సిగ్గు లేకుండా బిజెపి సెప్టెంబరు 17వ తేదీ గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని ఆమె ఎద్దేవ చేశారు. ప్రజల పోరాటాలను తమకు అనుకూలంగా మార్చుకోవాలని బిజెపి చేస్తున్న నీతిమాలిన రాజకీయాలను ప్రజలకు వివరిస్తామని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు స్టాలిన్, కమతం యాదగిరి, నెర్లకంటి శ్రీకాంత్, ఉమర్‌ఖాన్, బాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నిమజ్జనానికి వంటసామాగ్రి వినాయకుడు

**హైదరాబాద్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** వినాయక నిమజ్జనోత్సవాల్లో మలక్‌పేట్‌లోని ఓవైద్యుడు వినూత్నంగా తయారుచేసిన లంబోదరుడు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. పర్యావరణం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ విశ్రాంత వైద్యుడు డాక్టర్ అమరావతి ప్రభాకరాచారి వంట పాత్రలతో విఘ్నేశ్వరుడిని తయారుచేశారు. వంట సామాగ్రిలోని గ్లాసులు, గిన్నెలు, లాంబాళాలు, చెంచాలతో వినూత్న రీతిలో తీర్చిదిద్దారు. ఆవినాయకుడిని తన వద్ద ఉన్న వింటేజ్ కారుపై కొలువు తీరిచ హుస్సేన్‌సాగర్‌కు తీసుకువచ్చారు. దారిపొడవునా ఆవిగ్రహం ప్రజలను ఆకట్టుకుంటూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈసందర్భంగా వినాయకుడితో భక్తులు సెల్ఫీలు తీసుకుంటూ మురిసిపోయారు. అయితే ఆవిగ్రహాన్ని ప్రభాకరాచారి నిమజ్జనం చేయకపోవడం విశేషం. దానిబదులు మట్టితో తయారు చేసిన విగ్రహాన్ని ఆయన సాగర్‌లో నిమజ్జనం చేశారు. మట్టివిగ్రహాలపై అవగాహన కల్పించడంతోపాటు ప్రజల్లో ఆలోచన రేకెత్తించేందుకు ప్రతిఏటా ఇలాంటి కార్యక్రమాన్ని చేస్తున్నట్లు



కావ్యకిషన్‌రెడ్డిని సన్మానిస్తున్న బిజెపి నేతలు

## ఫీవర్ ఆస్పత్రి చౌరస్తాలో భారీ స్వాగత వేదికలు

**హైదరాబాద్, సెప్టెంబరు 17 ప్రభాతవార్త :** ఫీవర్ ఆస్పత్రి చౌరస్తాలో భారీ స్వాగత వేదికలను ఏర్పాటు చేశారు. ఫాతిమా ఫౌండేషన్ చైర్మన్ అనితా షేక్ గౌస్ మోహిద్దిన్ సౌజన్యంతో స్ఫూర్తి భవన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, బిజెపి సీనియర్ నాయకుడు మధుసూదన్‌యాదవ్ ఆధ్వర్యంలో గణపతులకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి సతీమణి కావ్య కిషన్‌రెడ్డి, బిజెపి సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గౌతంరావు, నల్లకుంట కార్పొరేటర్ ఎన్.అమృత పాల్గొన్నారు. ఈ సందర్భంగా హుస్సేన్‌సాగర్‌కు తరలివెళ్లే గణపతులపై పూలవర్షం కురిపించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు శ్యాంరాజ్, భాస్కర్‌యాదవ్, శ్రీనివాస్, రాజ్‌కుమార్, శిరీష, ప్రేమ్‌రాజ్, సునిత, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## మణికొండలో తెలంగాణ తల్లికి క్షీరాభిషేకం

**నార్సింగి, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త :** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పిలుపు మేరకు మణికొండ మర్రిచెట్టు చౌరస్తాలో బిఆర్ఎస్ నాయకులు "తెలంగాణ తల్లి" చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మణికొండ మున్సిపల్ బిఆర్ఎస్ అధ్యక్షులు సీతారాం దూళిపాళ్ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం ఆద్యాంతం జై తెలంగాణ... జైజై తెలంగాణ... సెక్రెటేరియట్ వద్ద రాజీవ్ గాంధీ విగ్రహం వద్దూ... తెలంగాణ తల్లి విగ్రహం ముద్దు... అన్న నినాదాలతో దద్దరిల్లిపోయింది. ఈ సందర్భంగా సీతారాం ధూళిపాళ్ల మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి సెక్రెటేరియట్ వద్ద తెలంగాణ తల్లి విగ్రహంను ఏర్పాటు చేయాలనుకున్న స్థలంలో రాజీవ్ విగ్రహంను ఏర్పాటు చేసి తెలంగాణ బిడ్డలకు తీరని ద్రోహం చేశారన్నారు. నాడు తెలంగాణ ఉద్యమంలో కలిసి రాలేదని, నేడు తెలంగాణ బిడ్డల ఆకాంక్షలకు విరుద్ధంగా రాజీవ్ విగ్రహంను ఆవిష్కరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా రంజకమైన పాలన అందించి, ప్రజల కష్టాలను దూరం చేయాల్సిన సీఎం స్థానంలో ఉన్న నాయకుడు తెలంగాణలోని 4.కోట్ల మంది ప్రజల ఆశలకు విరుద్ధంగా రాజీవ్ విగ్రహంను ఆవిష్కరించి ప్రజా వ్యతిరేక పాలన కొనసాగిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలు పట్లోళ్ల రూపారెడ్డి, సీనియర్ నేతలు నవీన్ కుమార్, రాజేంద్రప్రసాద్, విజయలక్ష్మి ఉపేంద్రనాథ్‌రెడ్డి, షేక్ ఆరిఫ్, లక్ష్మణరావ్, శ్రీకాంత్, శ్రీధర్, రేఖ, లక్ష్మయ్య, కిరణ్, రామ సుబ్బారెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పోలీసులతో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ కమిటీ వాగ్వాదం

**హైదరాబాద్ సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** ఖైరతాబాద్ సప్తముఖ మహాశక్తి గణపతి శోభ యాత్ర అంగరంగ వైభవం గా జరిగింది. ముందస్తు గానే అన్నిచర్యలు తీసుకు న్న నిర్వాహకులు , పోలీ సులు మంగళవారం తెల్లవారు జామునే అనుకున్న సమయానికి శోభాయాత్ర ప్రారంభించారు. అయితే పోలీసుల తీరు నచ్చకపోవ డంతో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. మహాగణపతిని తీసుకెళ్తున్న వా హనానికి ఉత్సవ కమిటీ సభ్యులు అడ్డుగా కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. దీంతో టెలిఫోన్ భవన్ వద్ద కాసేపు శోభయాత్ర నిలిచిపోయింది. దూర ప్రాంతాల నుంచి వినాయ కుడిని చూసేందుకు వచ్చి న భక్తులకు కనీసం దర్శ నం చేసుకునే అవకాశం కూడా కల్పించడంలేదని ఉత్సవ కమిటీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఉత్సవ కమిటీ సభ్యులకు పోలీసులు నచ్చజెప్పడంతో శోభాయాత్ర ముందుకు సాగింది.

## మహాసభను విజయవంతం చేయండి : ఏఐటియుసి

**సికింద్రాబాద్, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త:** సెప్టెంబర్ 22,23 తేదీలలో జరిగే తెలంగాణ రాష్ట్ర ఆటో, క్యాబ్, ప్రైవేట్ మోటార్ డ్రైవర్స్, అండ్ యూనియన్(ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో జరిగే ప్రదర్శన, మహాసభను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉమర్‌ఖాన్ కోరారు. సీతాఫల్ మండి చౌరస్తా అంబేద్కర్ విగ్రహం వద్ద మహాసభకు సంబందించిన గోడ పత్రికను నేతలతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం ద్వారా నష్టపోయిన ఆటో, క్యాబ్ డ్రైవర్‌లను ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆటో, క్యాబ్ డ్రైవర్‌లకు ఇస్తామన్న రూ. 12వేలు తక్షణమే అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లతీఫ్ ఉద్దిన్, లక్ష్మణ్, మహ్మద్ హుస్సేన్ పాల్గొన్నారు.

## ట్యాంక్‌బండ్ నిమజ్జనంలో దొంగల హల్‌చల్

**హైదరాబాద్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** మహానిమజ్జనంలో భాగంగా పలువురు దొంగలు చేతివాటం చూపించారు. పోలీసులు కథనం ప్రకారం గణపతి భక్తుడు బాబు వినోద్ మెడలో నుంచి ఓ దొంగ రద్దీలో దూరి ఆయన చైన్ దొంగిలించి పారిపోవడానికి ప్రయత్నించాడు. ఇది గుర్తించి వినోద్ అక్కడి పోలీసులకు చెప్పడంతో పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి దొంగను పట్టుకున్నారు. కాగా దొంగతనానికి పాల్పడిన వ్యక్తి లంగర్‌హౌజ్ డిఫెన్స్ కాలనీకి చెందిన సల్మాన్‌గా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం అతడినుంచి చైన్ స్వాధీనం చేసుకున్న పోలీసులు బాబువినోద్‌కు అందజేశారు.

## మైనర్ బాలికపై దుండగుడు లైంగిక దాడి

**బోడుప్పల్, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త:** మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణంగా చోటు చేసుకుంది. ఓ మైనర్ బాలికపై దుండగుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మైనర్ బాలిక(14) స్థానికంగా ఉండే ఓ స్కూల్లో 8వ తరగతి చదువుతుంది. కేశవరెడ్డి(36) అనే వ్యక్తి రూంలో బంధించి ఈ ఘాతుకానికి ఒడిగట్టాడు. ఈ ఘటనపై బాలిక తల్లితండ్రులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు ఫోక్సో యాక్ట్ కింద కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పరారీలో ఉన్న కామాందుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

## కనుల పండువగా వినాయక నిమజ్జన శోభాయాత్ర

**కొల్చారం, సెప్టెంబర్17 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో మంగళవారం ఛత్రపతి యువజన సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక నిమర్జన శోభాయాత్ర కన్నుల పండుగలా సాగుతోంది. ఛత్రపతి యువజన సంఘ సభ్యులు, మహిళా భక్తుల ఆట పాటల నడుమ సంప్రదాయ పద్ధతిలో బొజ్జ గణపయ్య ముందుకు కదులుతున్నాడు. వినాయక ప్రతిమతో పాటు శోభాయాత్రలో శివుని విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రత్యేకంగా పూలతో ముస్తాబు చేసిన వాహనంలో వినాయక విగ్రహంతో గ్రామంలోని పురవీధుల గుండా శివుని విగ్రహానికి కూడా ఊరేగింపు నిర్వహించారు. ఈ సుందర దృశ్యాన్ని చూడటానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఛత్రపతి యువజన సంఘం సభ్యులు, మహిళా భక్తులు, గ్రామ ప్రజలు తదితరులు ఉన్నారు.

## గంగమ్మ ఒడికి చేరేందుకు బయలెక్కిన గణనాథులు

**జహీరాబాద్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** 11 రోజులు భక్తులతో నిత్య పూజలు అందున్న వినాయకులు మంగళవారం గంగమ్మ ఒడికి చేరేందుకు (నిమర్జనం) మండపాల నుంచి అందంగా అలంకరించిన వాహనాల్లో కూర్చుని పయనమయ్యారు. మండల పరిధిలోని కొత్తూర్(బి) గ్రామ శివారులోని నారింజ ప్రాజెక్టులో నిమర్జనానికై అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. యువకులు భక్తి పారవశ్యంతో నృత్యాలు చేస్తుండగా, మహిళలు కోలాటలు ఆడుతూ ఆనందోత్సవాల మధ్య వినాయకులు బయలెక్కారు. ప్రాజెక్టు సమీపంలో భక్తులకు ఇబ్బందులు కల్గకుండా విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. నిమర్జన కార్యక్రమాలు ప్రశాంతంగా ముగిసేందుకు డిఎస్‌పి రామ్మోహ్మన్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. పట్టణంలోని భవాని మందిర్ చౌరస్తా వద్ద సర్వజనిక్ ఉత్సవ కమిటి వేదిక వద్ద అయా రాజకీయ పార్టీల నాయకులు, అల్లాడి వీరేశం దుకాణం వద్ద ఎల్ఐసి కార్పోరేషన్ జహీరాబాద్ శాఖ లియాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేదిక వద్ద ఎల్ఐసి ఏజంట్లు అటుగా వచ్చిన వినాయకులకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వాగతం పలికి వీడ్కోలు పలుకుతున్నారు.

## చక్రియాల్‌లో ఘనంగా అనంత చతుర్ధశి వేడుకలు

**పుల్కల్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** ఉమ్మడి పుల్కల్ మండలంలోని చౌటకూరు మండల పరిధిలోని చక్రియాల్ గ్రామంలో కొలువుదీరిన శ్రీ అనంత పద్మనాభ స్వామి ఆయలంలో మంగళవారం అనంత చతుర్ధశి వేడుకలను భక్తులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఆలయంలో ఏకాదశ శ్రీసుక్త పురుష సుక్త అభిషేకం భవాని రామలింగేశ్వర రుద్రాభిషేకం, అనంత వ్రత పూజా కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా జరుపుకున్నారు. అనంత పద్మనాభ స్వామి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం ఆలయంలో అనంత చతుర్దశి వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఉత్సవాలను తిలకించేందుకు గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని స్వామి వారిని దర్శించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## సిఎస్ఆర్ నిధులతో పరుపుల పంపిణీ

**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 17, ప్రభాతవార్త:** పట్టణంలోని మలాని ఫోమ్స్ పరిశ్రమ యజమాన్యం పరుపులను అందించారు. వృద్దులకు 100 పరుపులను తయారు చేయించి వారికి మంగళవారం నాడు అందించారు. సిఎస్ఆర్ నిధులతో ఈ పరుపులను అందించినట్లు పరిశ్రహ హెచ్ఆర్ పృధ్విరాజ్ తెలిపారు. చిన్నశంకరంపేట పట్టణ అభివృద్ధికి తన సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో పట్టణ మాజీ సర్పంచి రాజిరెడ్డి, పరిశ్రమ మేనేజర్లు భవాని శంకర్, రామకృష్ణ, చిరంజీవి, రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## శతచిత్ర నిర్మాత రామసత్యనారాయణకు సత్కారం

**చిక్కడపల్లి, సెప్టెంబరు 17 ప్రభాతవార్త:** శతచిత్ర నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణకు అభినందన సత్కార కార్యక్రమం సంస్కృతిరత్న డాక్టర్ కె.ధర్మారావు ఆధ్వర్యంలో జరిగింది. 'మా', 'ఫాస్', ఇటమా ఫిలిం అవార్డు సంస్థల తరఫున సత్యనారాయణరెడ్డి, మలిడి తదితరులు రామసత్యనారాయణకు గంధం వినాయక ప్రతిమను బహుకరించారు.

## నేత్రపర్వంగా 'ఉమామహేశ్వరస్వామి కల్యాణోత్సవం'

**చిక్కడపల్లి, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త:** ఆర్టీసిక్రాస్‌రోడ్స్ శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో జరుగుతున్ననవరాత్రోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం రాత్రి నేత్రపర్వంగా ఉమామహేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం జరిగింది. భక్తులు తిలకిస్తుండగా, వేదపండితుల వేదఘోష మధ్య ఈ కళ్యాణక్రతువు ఆలయం ఈవో లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఉదయం స్వామివారికి సుప్రభాతం, బిందెతీర్థం అనంతరం మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, గణపతి హోమం అనంతరం ప్రతే ్యక పూజలు నిర్వహించారు. అంతకుముందు మహిళల ఆధ్వర్యంలో సామూహిక లలిత, విష్ణు సహస్రనామపారాయణోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలు పూర్తిఅయిన తర్వాత స్వామివారికి పల్లకీసేవ, బలిహరణ, నివేదన, హారతి, మంత్రపుష్పం కార్యక్రమాలను శాస్త్రోకంగా వేదపండితుల జరిపించారు. అంతకుముందు ఉదయం మహిళల ఆధ్వర్యంలో కుంకుమ పూజోత్సవాలను శాస్త్రోక్తంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం లో అర్చకులు కాశీనాథ్‌శర్మ, గోపాలాచార్యులు, భవానీ ఆచార్యులు, రామాచార్యులు, జగన్మోహనాచార్యులు, ఆలయం పూర్వ చైర్మన్ బిఎన్.శ్రీనివాస్‌రావు యాదవ్, భక్త బృందం సభ్యులు ఎఎస్‌వి.రమణమూర్తి, జి.గజానంద్, ఆలయం సిబ్బంది రాజు తదితరులు పాల్గొన్నారు.

**నేడు మహాపూర్ణాహుతి...**

కాగా గణపతి ఆలయంలో జరుగుతున్న నవరాత్రి పూజోత్సవాలలో భాగంగా బుధవారం శుక్రవారం మహాపూర్ణాహుతి సందర్భంగా అన్నబలి, ఉదయం 11 గంటలకు సత్యనారాయణస్వామి వ్రతాలు, సాయంత్రం రథోత్సవం, పుష్పఅలంకరణ ఉంటుందని ఈవో లక్ష్మారెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామికృపకు పాత్రులు కావాలని కోరారు.


సర్వే చేస్తున్న అధికారులు

## జోగిపేట-అజ్జమర్రి రోడ్డుకు అధికారుల సర్వే

**జోగిపేట, సెప్టెంబర్ 17, ప్రభాతవార్త:** జోగిపేట-అజ్జమర్రి రోడ్డు పనులకు సంబంధించి సర్వే పనులను అధికారులు వేగవంతం చేశారు. జోగిపేటను మరింతగా అభివృద్ధి చేయాలే ఉద్దేశంతో వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రత్యేక చొరవ తీసుకొని ఈ రోడ్డుకు నిధులను మంజూరు చేయించారు. సుమారు ఎనభై కోట్లతో ఈ రోడ్డు నిర్మాణం జరగనుంది. ఇందుకుగాను రోడ్డుకు సంబంధించిన సర్వే పనులు మొదలుపెట్టారు. ముఖ్యంగా జోగిపేటలోని మల్లన్న గండి ప్రాంతం నుంచి రిక్షా కాలనీ మీదుగా జోగిపేటలోని అంబేద్కర్ చౌరస్తా వరకు రోడ్డు నిర్మాణంలో పలు గృహాలు ఉండటంతో సమస్య ఏర్పడుతుంది. ఈ విషయంలో ఏవిధంగా ముందుకు వెళ్తే బాగుంటుందని అధికారులు సర్వే చేస్తున్నారు. ముందుగా సర్వేచేసిన అనంతరం పూర్తి వివరాలు మంత్రి దృష్టికి తీసుకెళ్లి ఆయన ఆదేశాలమేరకు పనులుచేపట్టాలని అధికారులు పేర్కొంటున్నారు. కాగా ప్రస్తుతానికి రోడ్డు పనులకు సంబంధించి ఆర్ అండ్ బి ఎస్ఇ వసంతకుమార్ ఆధ్వర్యంలో మంగళవారం సర్వే చేపట్టారు.

## వేలంలో రూ. 1,55,555 పలికిన లడ్డూ

### సొంతం చేసుకున్న వీర్‌శెట్టి

**నారాయణఖేడ్ టౌన్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** పట్టణంలోని వినాయక మండపం వద్ద గజాననుడి చేతిలోని మొదటి లడ్డూను వేలం వేయగా బిఎస్ టెక్స్‌టైల్స్ యజమాని వీర్‌వెట్టి రూ.1,55,555 దక్కించుకున్నారు. శివాజీదళ్ నిర్వాహకులు వీర్‌శెట్టికి శాలువాతో సన్మానించి గణేశుడి లడ్డూను అందచేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ శెట్కార్, నాయకులు శెట్టి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## వినాయకుడి లడ్డూలు రూ. 4.21 లక్షలు


రామచంద్రారెడ్డి నగర్‌లో వినాయకుడి లడ్డు వేలం దృశ్యం

**రామచంద్రాపురం, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని రామచంద్రారెడ్డి నగర్ కాలనీలో కొలువున్న వినాయకుడి లడ్డూలను వేలం వేయగా భక్తులు రూ.4.21 లక్షలకు దక్కించుకున్నారు. కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మండపంలో కొలువున్న లంబోదరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి రెండు లడ్డూలను వేలం వేశారు. జిల్లా గ్రంథాలయ మాజీ డైరెక్టర్ కుమార్‌గౌడ్ సతీమణి తాళ్ల పద్మ (కేవలం మహిళకు మాత్రమే) లడ్డూను 2లక్షలకు, జనరల్ లడ్డూ(అందరు వేలంలో పాల్గొనగా) కాలనీకి చెందిన పెద్దమైల్ వెంకట్‌రెడ్డి విజయ దంపతులు రూ. 2.21 లక్షలకు దక్కించుకున్నారు. వేలంలో లడ్డూలను దక్కించుకున్న వారికి కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ కాలనీ సంక్షేమ సంఘం బాధ్యులతో కలిసి లడ్డులను అందచేశారు. ఈ సందర్భంగా యువకులు నృత్యాలు చేస్తూ వినాయకుడిని గంగమ్మ ఒడికి తరలించారు. ఆయా విభాగాల్లో నిర్వహించిన ఆటల, పాటల పోటీల్లో ప్రతిభ చాటిన వారికి బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజేశ్వర్‌రెడ్డి, నగేష్ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు


విశ్వకర్మ జయంతిని జరుపుకుంటున్న దృశ్యం

**చౌటకూరు, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ భగవాన్ జయంతివేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విశ్వకర్మ చిత్రపటానికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఐ నాగరాజు, విశ్వ బ్రాహ్మణ గ్రామ అధ్యక్షుడు కమ్మరి దర్శనం, ప్రధానకార్యదర్శి వీరన్న, ఉపాధ్యక్షులు కమ్మరి వీరేశం, శేఖర్ చారి, హరిచారి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

**బెల్ టౌన్‌షిప్‌లో...**


భగవాన్ విశ్వకర్మ జయంతిని జరుపుకుంటున్న భక్తులు

**రామచంద్రాపురం, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** బెల్ టౌన్‌షిప్‌లో కొలువున్న విశ్వకర్మ విరాట్ దేవాలయంలో మంగళవారం శ్రీభగవాన్ విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. వేడుకల్లో కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి హోమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో విశ్వకర్మ సంఘం నాయకులు దేవేంద్ర చారి, ఫణి, ప్రసాద్, విష్ణు, మాయబ్రహ్మ, చెంచయ్య, ప్రభాకర్ చారి తదితరులు పాల్గొన్నారు.

## సోములు కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి

**పాపన్నపేట, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:**

బిఆర్ఎస్ జిల్లా నాయకులు తాడేపు సోములు కుటుంబాన్ని మంగళవారం మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిలు పరామర్శించారు. ఇటీవల సోములు సోదరుడు సుధాకర్ అనారోగ్యంతో కానరాని లోకాలకు చేరిపోయినట్లు తెలుసుకున్న మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యేలు సుధాకర్ స్వగృహానికి చేరుకుని మృతుడి భార్య యాదమ్మ, కుమారులు కృష్ణ, రాకేష్, కూతురు అంజలిలను పరామర్శించారు. కుటుంబానికి అండగా బిఆర్ఎస్ పార్టీ ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో మాజీ ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ జగపతి, పాపన్నపేట మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షులు కుమ్మరి జగన్, మెదక్ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, మండల బిఆర్ఎస్ అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు గురుమూర్తిగౌడ్, బాపరావ్, లింగారెడ్డి, కిష్టయ్య, జగన్ తదితరులు పాల్గొన్నారు.


మనూర్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న అధికారులు


న్యాల్‌కల్‌లో రెవెన్యూ కార్యాలయం వద్ద జండాను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్


నారాయణఖేడ్‌లో జాతీయ జండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి


తెల్లాపూర్ మున్సిపాలిటీలో జాతీయజెండాను ఆవిష్కరించిన దృశ్యం


అల్లాదుర్గంలో మండల పరిషత్ వద్ద జండాను ఆవిష్కరిస్తున్న అధికారులు


ఝరాసంగం జండాను ఆవిష్కరిస్తున్న ఏపిఓ రాజ్‌కుమార్

# ఘనంగా ప్రజాపాలన దినోత్సవం

**మనూర్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:**

మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో మంగళవారం ప్రజా పాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద జాతీయ జండాలను ఆవిష్కరించారు. రెవెన్యూ కార్యాలయం వద్ద తహసీల్దార్ వెంకటస్వామి, మండల పరిషత్ వద్ద మండల ప్రత్యేక అధికారి రమేష్‌బాబు, పోలీసు ఠాణా వద్ద ఎస్.రాజశేఖర్, వసతి గృహం వద్ద వార్డెన్ రాజిరెడ్డి, వ్యవసాయ కార్యాలయంలో ఏఓ మహేశ్‌చౌహాన్, రైతువేదికలో ఏఈఓ సంగమేశ్వర్, ఇందిరా గాంధీ చౌక్ వద్ద బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాఘవాచారి జోషిలు జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపిడిఓ అలివేలు మంగ, సీనియర్ అసిస్టెంట్ వివేకానంద, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుభాష్‌రావు పాటిల్, మాజీ సర్పంచ్‌లు అంజయ్య, సాయిలు, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

**న్యాల్‌కల్ మండలంలో...**

**న్యాల్‌కల్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లోని రైతువేదికలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద ప్రజాపాలన దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. న్యాల్‌కల్‌లోని రెవెన్యూ కార్యాలయం వద్ద తహసీల్దార్ భూపాల్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి, న్యాల్‌కల్ సొసైటీ చైర్మన్ సిద్ధిలింగయ్య స్వామి, ఆయాపార్టీలనాయకులు, అధికారులు పాల్గొన్నారు.

**నారాయణఖేడ్ మండలంలో...**

**నారాయణఖేడ్ టౌన్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** పట్టణంలో మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల కిష్టారెడ్డి, తహసీల్దార్ కార్యాలయాల్లో నిర్వహించిన తెలంగాణ విమోచన దినోత్సవంలో ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పాల్గొని జాతీయ జండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల సుధాకర్‌రెడ్డి, ఆర్‌డిఓ, మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్ సేట్, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

**తెల్లాపూర్‌లో...**

**రామచంద్రాపురం, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** తెల్లాపూర్ మున్సిపాలిటి ప్రధాన కార్యాలయంలో మంగళవారం ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. మున్సిపల్ చైర్మన్ మల్లేపల్లి లలితసోమిరెడ్డి ఉదయం కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నేషనల్ వైడ్ కాంపైన్ స్వచ్చత-హీ-సేవా 2024లో భాగంగా స్వభావ స్వచ్చత సంస్కార్ స్వచ్చత, స్వచ్ఛభారత్ దివస్, మన పరిసరాలను పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. అక్టోబరు 2వ తేదీ వరకు ప్రజలకు అవగాహన ప్రచారం చేస్తామన్నారు. తెల్లాపూర్ గద్దర్ సర్కిల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బాలగోని రాములుగౌడ్, కౌన్సిలర్లు చిట్టి ఉమేశ్వర్, లచ్చిరాంనాయక్, బాబ్జి, కమ్మెట జ్యోతి శ్రీకాంత్‌రెడ్డి, బి నాగరాజు, పట్లోళ్ల రవీందర్‌రెడ్డి, శంషాబాద్ రాజు, బాబ్జి, పావని, రవీందర్ రెడ్డి, సరిత శ్రీనివాస్‌రెడ్డి, మంజుల శ్రీనివాస్‌రెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు జి.విజయలక్ష్మి నరసింహ, మున్సిపల్ కమిషనర్ ఎం.సంగారెడ్డి, ఏఈ సాయిమౌనిక, కర్దనూర్, పాటి ఘనపూర్, పోచారం, ముత్తంగి గ్రామాల మాజీ సర్పంచ్‌లు, మాజీ ఉప సర్పంచులు, మాజీ ఎంపిటిసి సభ్యులు, మాజీ వార్డు సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

**అల్లాదుర్గం మండలంలో...**

**అల్లాదుర్గం, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో మంగళవారం ప్రజా పాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జాతీయ జండాలను అవిష్కరించి గీతాలాపన చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ మల్లయ్య, సిఐ కార్యాలయంలో సిఐ రేణుక, పంచాయిరాజ్ కార్యాలయంలో డిప్యూటీ ఈఈ శ్రీనివాస్‌గౌడ్, ఎంపిపి కార్యాలయం వద్ద ఎంపిడిఓ మల్లయ్య, పోలీసు ఠాణాలో ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో స్పెషల్ ఆఫీసర్ స్రవంతి, అల్లాదుర్గం గ్రామపంచాయితీవద్ద ప్రభాకర్, జడ్పీహెచ్ఎస్, బాలుర పాఠశాలలవద్ద ప్రధా నోపాధ్యాయులు ధనుంజయగౌడ్ జండాలను ఆవిష్కరించారు.

**నాగల్‌గిద్ద మండలంలో**

**నాగల్‌గిద్ద, సెప్టెంబరు 17, ప్రభాతార్త:** మండల కేంద్రమైన నాగల్‌గిద్దలో మంగళవారం ప్రజా పాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నార. మండల పరిషత్ కార్యాలయంతో పాటు ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ కార్యాలయాల వద్ద జాతీయ జండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ మహేశ్వర్‌రావు, తహసీల్దార్ రమాదేవి, నాయకులు గుండేరావుపాటిల, సంజీవ్ పాటిల్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.


ఝరాసంగం ఠాణాలో జండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**ఝరాసంగంలో...**

**ఝరాసంగం, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో మంగళవారం ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలోని ఇందిరా క్రాంతి పథకం కార్యాలయం, పోలీసు ఠాణాలలో జాతీయ జండాను అధికారులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ సుధాకర్, ఎస్ఐ నరేష్, తహసీల్దార్ తిరుమలరావు, ఎపిఓ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


అల్లాదుర్గంలో బిజెపి కార్యాలయంలో జండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

## అల్లాదుర్గంలో తెలంగాణ విమోచన దినోత్సవం

**అల్లాదుర్గం, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో మంగళవారం తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ జండాను ఆవిష్కరించి జాతీయ గీతాన్ని అలపించారు. ఈ సందంర్భంగా బిజెపి మండల అధ్యక్షులు యాదగిరి, ప్రధాన కార్యదర్శి సాయిలు గౌడ్, మెదక్ జిల్లా కార్యవర్గ సభ్యులు కాల రాములులు మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు చమరగీతం ఆపడి తెలంగాణ ప్రజలకు స్వేచ్చను సాధించి పెట్టిన అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాల్సిన అసవరం ప్రతి తెలంగాణ బిడ్డపై ఉందన్నారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు కె బ్రహ్మం, విద్య బేతయ్య తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే

**జహీరాబాద్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** వినాయక నిమజ్జనాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని కొత్తూర్(బి) గ్రామ శివారులోని నారింజ ప్రాజెక్టును (ప్రాజెక్టులో నియోజవర్గ గణపతులు నిమర్జనం ఉంటుంది) ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు మంగళవారం అధికారులు, నాయకులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, బిఆర్ఎస్ నాయకులు గుండప్ప, పెంటరెడ్డి, మచ్చేందర్, సంజీవ్‌రెడ్డి, నామ రికిరణ్, మోహియొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



## పాపన్నపేటలో ఘనంగా విశ్వకర్మ జయంతి

**పాపన్నపేట, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో మంగళవారం విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం విశ్వకర్మ జండాను ఆవిష్కరించి జయంతి వేడుకలను ప్రారంభించారు. విశ్వకర్మ భగవానుడికి వేద పండితులు నారాయణ వేద మంత్రాలు వల్లిస్తుండగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వకర్మ నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశ్వకర్మలకు చేయూత అందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం కొరకు మండలంలోని 18 గ్రామాల పంచాయితీలకు లాగిన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో విశ్వకర్మ సంఘం మండల అధ్యక్షులు వడ్ల కుబేరుడు, పట్టణ అధ్యక్షులు లక్ష్మణ్ చారీ, సభ్యులు మిన్పూర్ శ్రీనివాస్,వెంకటేశం, సాయిలు, రఘు, నర్సింలు చారీ, శ్రీను, బాగేష్, నాగరాజు, గురుమూర్తిగౌడ్, నరేందర్‌గౌడ్, బొకొండ రాములు తదితరులు పాల్గొన్నారు.

**అల్లాదుర్గంలో...**

**అల్లాదుర్గం, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో మంగళవారం భగవాన్ విశ్వకర్మ జయండి వేడుకలను విశ్వబ్రాహ్మణుల ఆధ్వర్యంలో భక్తి శ్రద్దలతో ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలోని వీరభద్రేశ్వర దేవాలయం వద్ద దేశశిల్పి విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని విశ్వకర్మ జండాను ఆవిష్కరించారు. విశ్వకర్మ చిత్ర పటానికి పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామి వారికి నైవేద్యాన్ని సమర్పించి దర్శించుకున్నారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణులు దుర్గేష్ చారి, మల్లప్ప, కే శ్రీనివాస్, అమృత్, ప్రభు, శేఖర్, నర్సింలు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.


జహీరాబాద్‌లో తెలంగాణతల్లికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

## తెలంగాణ తల్లికి క్షీరాభిషేకం

**జహీరాబాద్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** తెలంగాణ సచివాలయం ఎదుట రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం జహీరాబాద్ పట్టణంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు తెలంగాణ తల్లి చిత్ర పటానికి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామరావు సూచనల మేరకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ తల్లిని అవమానించేలా కాంగ్రెస్ ప్రభుత్వం తీరును తెలంగాణ వాదులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. తెలంగణ సిద్దాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహంతో పాటు తెలంగాణ మేధావుల విగ్రహాలు పెట్టకుండా రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ గుండప్ప, ఆత్మ కమిటి చైర్మన్ పెంటారెడ్డి, సొసైటీ చైర్మన్ మచ్చేందర్, మాజీ సొసైటీ చైర్మన్ సంజీవ్‌రెడ్డి, ఎస్‌సి సెల్ నియోజకవర్గ అధ్యఉఉలు బండి మోహన్, మాజీ పట్టణ అధ్యక్షులు మహియొద్దీన్, సిద్దన్నపాటిల్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు హిరు రాథోడ్, చిన్నరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గులాబ్ సింగ్, మహెబూబ్ ఖాన్, సిఎం అశోక్‌రెడ్డి, విరాకేష్, లవన్, ఫయాజ్, ప్రవీణ్, సల్మాన్, అలీ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అనంత చతుర్ధశి వేడుకలు

**నారాయణఖేడ్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** మండలంలోని సంజీవరావుపేట్‌లో మంగళవారం శ్రీలక్ష్మి అనంతపద్మనాభ ఆలయంలో అనంత చతుర్దశి వేడుకలను భక్తులు భక్తిశ్రద్దలతో ఘనంగా జరుపుకున్నారు. అనంత చతుర్ధశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని రంగు రంగుపూలతో అందంగా అలంకరించి ఆలయంలో 39 మంది దంపుతులు పద్మనాభ స్వామి వత్రంలో పాల్గొని ఒకొక్కరు 1లక్షకు పైగా వత్తులను అర్చకులు ప్రవీణ్ పూజారి వేద మంత్రాలు వల్లిస్తండగా యజ్ఞ హోమ గుండంలో వేసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ పరిసరాలను స్వామి వారి నామస్మరణతో మారోమ్రోగింది. ఆలయానికి చేరుకున్న భక్తులకు ప్రసాద వితరణ (అన్నదానం) చేశారు. కార్యక్రమంలో శ్రీ అనంత శయన ఉత్సవ కమిటి బాధ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులపై సమీక్షించిన అధికారులు

**పుల్కల్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** మండలంలో కొనసాగుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాల అములపై మంగళవారం మండల ప్రత్యేక అధికారి మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో కలిసి సమీక్షించారు. పంచాయితీ కార్యదర్శులు, ఉపాధి హామి, ఇందిరా క్రాంతి పథకం అధికారులతో ఎస్‌హెచ్ఎస్ 2024పై సమీక్షించారు. ఎస్‌హెచ్ఎస్ 2024లో భాగంగా రోజు వారిగా గ్రామ స్థాయిలో పూర్తి చేయు కార్యక్రమాలు, వాటికి సంబంధించి ఆన్‌లైన్‌లో ప్రోగ్రెస్సింగ్ విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమం అక్టోబరు 2వ తారీఖు వరకు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ ఆనంద్ మేరీ, ఎంపిఓ శ్రీకాంత్‌గౌడ్, జూనియర్ అసిస్టెంట్ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి బాలరాజు

# ప్రజల ఆకాంక్షలను పట్టించుకోని రేవంత్ సర్కార్

### బిజెపి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి

**సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** ప్రజల ఆకాంక్షలను పట్టించుకోకుండా తెలంగాణ సర్కార్ పాలిస్తోందని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి విమర్శించారు. కందిలోని బిజెపి జిల్లా కార్యాలయంలో మంగళవారం గోదావరి అంజిరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్బంగా గోదావరి మాట్లాడుతూ తెలంగాణ విమోచన దినం అధికారికంగా నిర్వహించకుండా రాష్ట్ర ప్రజల మనోభీష్టానికి వ్యతిరేకంగా రేవంత్ సర్కార్‌పై మండిపడ్డారు. లేలాది మంది విరోచిత పోరాటాల మూలంగానే తెలంగాణకు విమోచన లభించిందని గుర్తు చేశారు. నిజాం రజాకార్ల మెడలు వంచి తెలంగాణ సాధించడంలో ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ పాత్ర కీలకమన్నారు. మంగళవారం లిబరేషన్ డే ఉత్సవాలు, విశ్వకర్మ జయంతి, వినాయక శాభా యాత్ర (నిమర్జనం), భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోది జన్మదినం వేడుకలు ఒకే రోజు రావడం ఆనందంగా ఉందన్నారు. గత మూడేళ్లుగా కేంద్ర ప్రభుత్వం తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు రజాకార్ల వారసత్వమైన మజ్లీస్ పార్టీకి కొమ్ము కాస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించకపోవడాన్ని ఇందుకు ఉదహరించారు. నిజాం రజాకార్ల దళం సృష్టించినదే ఎంఐఎం పార్టీ అని, ఎంఐఎంకు భయపడే నాడు బిఆర్ఎస్, నేడు కాంగ్రెస్ పార్టీ తెలంగాణ విమోచన దినోత్సవాన్ని జరుపుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల తరహాలో తెలంగాణ రాష్ట్రం కూడా తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా జరుపుకోవాలని సూచించారు. ఇదిలా ఉండగా కార్యాలయంలో విశ్వకర్మ జయంతి, దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు,బిస్కెట్లు పంపిణి చేశారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంజిరెడ్డి, ఎడ్ల రమేష్, రాజేశ్వర్ దేశ్‌పాండే, విష్ణువర్ధన్‌రెడ్డి, నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి విజయపాల్‌రెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు వెంకట నరసింహారెడ్డి, పోచారం రాములు ప్రతాప రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కొలుకూరి రాజశేఖర్ రెడ్డి, డాక్టర్ రాజు గౌడ్, జిల్లా కార్యాలయ కార్యదర్శి దోమల విజయకుమార్, కౌన్సిలర్లు మందుల నాగరాజు, కసిని వాసు, పుల్లంగారి సురేందర్, మీనాగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీణ్ యాదవ్, సాయి, మధు లవన్ లక్ష్మి, సుజాత, పుణ్యవతి, హనుమంత్‌రెడ్డి, నర్సా రెడ్డి, రాజేందర్‌రెడ్డి, పాపయ్య, సదానంద చారి శ్రీకాంత్‌రెడ్డి, సుధాకర్, నరేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


సంగారెడ్డిలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని జరుపుకుంటున్న బిజెపి జిల్లా అధ్యక్షురాలు గోదావరి